www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..


పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 91 | గురువారం | 12 నవంబర్, 2026



స్వచ్ఛ నగరంగా హైదరాబాద్ 2



అస్సాంలోని గువాహటి సమీపంలో బుధవారం ఉదయం రైలు ప్రమాదం చోటుచేసుకుంది. కోల్‌కతా నుంచి మిజోరంలోని సైరాంగ్‌కు వెళ్తున్న కోల్‌కతా–సైరాంగ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌తో పాటు ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో నలుగురు స్వల్పంగా గాయపడినట్లు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ వెల్లడించారు. కామ్రూప్ మెట్రోపాలిటన్ జిల్లాలోని డిగారు రైల్వే స్టేషన్ వద్ద ఉదయం 6.54 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మరో రైలుకు దారి ఇచ్చేందుకు స్టేషన్‌లోకి వస్తున్న సమయంలో రైలు వేగాన్ని లోకో పైలట్ నియంత్రించలేకపోవడంతో ఇంజిన్, ఐదు బోగీలు పట్టాలు తప్పినట్లు ఈశాన్య సరిహద్దు రైల్వే అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన నలుగురిని సోనాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పట్టాలు తప్పిన రైలులోని ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ రైలును ఏర్పాటు చేశారు. వారికి ఆహారం, తాగునీరు వంటి కనీస అవసరాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై రైల్వే అధికారులు పరిశీలన చేపట్టారు. పట్టాలు తప్పిన బోగీలను తొలగించి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

మూసీ ప్రక్షాళనకు లైన్ క్లియర్

ప్రాజెక్టుకు అన్ని అనుమతులు వచ్చాయి

- త్వరలో టెండర్లు.. తొలి విడతలో 21 కి.మీ. మేర పునరుజ్జీవన పనులు
- ఎవరికీ అన్యాయం జరగకుండా బాధితులను ఆదుకుంటాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి • తమ్మిడికుంట చెరువు ప్రారంభం
- రెండెకరాల భూమి ఇచ్చిన నాగార్జునకు అభినందనలు



ప్రజానావ, హైదరాబాద్:

హైదరాబాద్ నగర భవిష్యత్తుకు కీలకమైన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టుకు అన్ని అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. మొత్తం 55 కిలోమీటర్ల మేర విస్తరించిన మూసీ నదిలో తొలివిడతగా 21 కిలోమీటర్ల మేర పునరుజ్జీవన పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఇది కేవలం సుందరీకరణ ప్రాజెక్టు కాదని, కాలుష్య నివారణతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమమని స్పష్టం చేశారు. హైటెక్ సిటీ ప్రాంతంలోని తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఒకప్పుడు 1,372 చెరువులు ఉండేవని, వివిధ కారణాలతో వాటిలో సగం కనుమరుగయ్యాయని చెప్పారు. ఆక్రమణలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం, జీవనోపాధి కోసం చెరువుల పరిసరాల్లో నివాసాలు ఏర్పరచుకోవడం వంటి కారణాలతో జలవనరులు కనుమరుగయ్యాయని పేర్కొన్నారు.

చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం

తమ్మిడికుంటను 14 ఎకరాల నుంచి 30 ఎకరాలకు విస్తరించి అభివృద్ధి చేసినట్లు సీఎం తెలిపారు. ఈ పనుల్లో సినీనటుడు అక్కినేని నాగార్జున రెండు ఎకరాల భూమిని అందించి సహకరించారని ప్రశంసించారు. సమాజ ప్రయోజనం కోసం ముందుకొచ్చిన నాగార్జున నిజజీవితంలోనూ హీరోగా నిలిచారని అన్నారు. నగరంలో తమ్మిడికుంటతో పాటు బతుకమ్మకుంట, బుమ్–రుక్కుద్దొలా, సున్నం చెరువు, నల్లచెరువు, ఫాక్స్ సాగర్, మియాపూర్ చెరువు సహా సుమారు 20 చెరువులను పునరుద్ధరిస్తున్నట్లు వెల్లడించారు. చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోతున్నాయని, ఫలితంగా రహదారులు తరువాయి 2లో..

ఇక 12వ తరగతి వరకు పాఠశాల విద్య
- వచ్చే ఏడాది నుంచే కొత్త విధానం అమలు
- మూడు దశల్లో విద్యా వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ: సీఎం

2

భూ రీ సర్వేలో పారదర్శకతకు పెద్దపీట 2



- క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పర్యటించి రైతుల సందేహాలు తీర్చాలి
- పాలేరు నియోజకవర్గంలోని 141 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు
- మరో వారం రోజుల్లో 400 రోవర్ల ఏర్పాటు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



అన్నదాతకు కేంద్రం అండ

- రబీ సీజన్‌కు రూ.62,370 కోట్ల రాయితీ
- గతేడాది కంటే రూ.24,417 కోట్లు అధికంగా సబ్సిడీ
- డీఏపీ బస్తా ధర యథాతథం.. రూ.1,350గానే విక్రయం
- సంక్షోభం ప్రభావం రైతులపై పడకుండా చర్యలు

6



రష్యా–ఉక్రెయిన్ ఖైదీల విడుదలకు అంగీకారం

- అబుధాబి చర్చల్లో కీలక పురోగతి

6

సీతమ్మసాగర్‌కు అనుమతులు సాధించండి

- నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు
- 15 కీలక అంశాలపై మంత్రి ఉత్తమ్‌తో సమీక్ష

2



మూసీ ప్రక్షాళనకు లైన్ క్లియర్

(మొదటిపేజీ తరువాయి)

జలమయమై ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. నీరు నిల్వ ఉండాల్సిన ప్రాంతాలను ఆక్రమిస్తే, చివరకు నీరు నివాస ప్రాంతాల్లోకి చేరి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని వ్యాఖ్యానించారు.

మూసీ కాలుష్యంతో నల్గొండకు ముప్పు

1908లో వచ్చిన భారీ వరదల తర్వాత నిజాం పాలకులు ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సూచనలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను నిర్మించారని సీఎం గుర్తుచేశారు. 1920 నాటికి పూర్తయిన ఈ జలాశయాలు వందేళ్లుగా హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. నిజాం కాలంలో మూసీ నది వెంట పురానాపూల్ వంతెన, సిటీ కాలేజీ, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి, బ్రిటిష్ రెసిడెన్సీ వంటి చారిత్రక కట్టడాలు నిర్మించారని పేర్కొన్నారు. అనంతర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మూసీ కాలుష్య కూపంగా మారిందని విమర్శించారు. మూసీ కాలుష్యం కారణంగా నల్గొండ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అక్కడి రైతుల సమస్యలను స్వయంగా పరిశీలించి తెలుసుకున్నానని తెలిపారు. ఇప్పటికే ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న ఆ జిల్లాకు కాలుష్యం మరో ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

బాధితులకు అండగా ఉంటాం

సబర్మతీ, గంగా, యమునా నదుల అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. నదీ పరివాహక ప్రాంతాలు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కేంద్రాలుగా మారుతాయని సీఎం అన్నారు. దక్షిణ కొరియాలో రివర్‌ఫ్రంట్ అభివృద్ధితో 24 గంటల ఆర్థిక కార్యకలాపాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనతో కాలుష్యం తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. పనుల వల్ల ఎవరైనా నష్టపోతే వంద శాతం ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ తర్వాత దాని నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్, ఇందిరా మహిళా శక్తి సంఘాల ఆధ్వర్యంలో చెరువును నిర్వహించాలని చెప్పారు. మహిళా శక్తి స్టాళ్ల ద్వారా చిన్న వ్యాపారాలకు అవకాశం కల్పించి 'లేక్ ఎకానమీ'ని అభివృద్ధి చేయాలని సూచించారు. దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగలు నిర్వహించుకునేలా చెరువును సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని, జమ్మి చెట్టు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అధ్యక్షత వహించగా, సినీనటుడు అక్కినేని నాగార్జున విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వరరెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలు గద్వాల విజయలక్ష్మి , శాసనమండలి విప్ పట్నం మహేందర్‌రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇక 12వ తరగతి వరకు పాఠశాల విద్య

- వచ్చే ఏడాది నుంచే కొత్త విధానం అమలు
- మూడు దశల్లో విద్యా వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ
- డ్రాపౌట్ల నివారణ, నాణ్యమైన బోధనే లక్ష్యం
- అద్దె భవనాల్లో హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఉండొద్దు: సీఎం రేవంత్



ప్రజానావ, హైదరాబాద్: విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యా విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు నాణ్యమైన విద్య అందించి, ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో గురువారం విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొత్త విధానంలో నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్య, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు సెకండరీ, తొమ్మిది నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా విభజించాలని సూచించారు. 12వ తరగతి నాటికి విద్యార్థులకు భాషా, సమాచార నైపుణ్యాలపై పట్టు కల్పించి, ఆ తర్వాత ఆసక్తికి తగిన సబ్జెక్టులను ఎంచుకునే అవకాశం ఉండాలన్నారు.

డ్రాపౌట్ల నివారణకు ప్రాధాన్యం

పదో తరగతి తర్వాత చదువు మానేస్తున్న వారిలో బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలే అధికంగా ఉంటున్నారని సీఎం పేర్కొన్నారు. కేంద్రీయ, నవోదయ, కస్తూర్బా పాఠశాలల్లో 12వ తరగతి వరకు విద్య కొనసాగుతుండటంతో డ్రాపౌట్లు తక్కువగా ఉన్నాయని తెలిపారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో ఈ విధానం అమలులో ఉందన్నారు. కొత్త విధానంతో జూనియర్ కళాశాలల లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉద్యోగాలు, పదవీ విరమణ ప్రయోజనాలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగకూడదని, అన్ని వసతులతో శాశ్వత భవనాలు నిర్మించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని, క్యూర్ పరిధిలోని పాఠశాలల పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అవసరమైన నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చిన తర్వాత విద్యార్థుల చేరికలు పెరిగాయని, శిక్షణ పొందిన వారందరికీ ఉద్యోగాలు లభించాయని సీఎం చెప్పారు. పాలిటెక్నిక్‌ల ఆధునికీకరణకు నిధుల విడుదల వేగవంతం చేయాలని ఆదేశించారు. విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్, అసోసియేట్, ఇతర ప్రొఫెసర్ల నియామకాలను నిబంధనల ప్రకారం త్వరగా పూర్తి చేయాలని, ఉన్నత విద్యా మండలి చైర్మన్, వీసీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పి. సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ మొలుగరం కుమార్, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, అధికారులున్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు: భట్టి

ప్రజానావ, హనుమకొండ: తెలంగాణ విద్యార్థులు ప్రపంచంలోని అగ్రదేశాల విద్యార్థులతో పోటీపడి, ఉన్నత స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేట విద్యానగర్‌లో నూతన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక బీసీ సంక్షేమ బాలుర వసతిగృహం ప్రాంగణంలో రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యుత్తమ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రపంచంలోని పది అగ్ర దేశాలతో పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశంతో సెమీ రెసిడెన్షియల్ విధానంలో పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. ఈ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ బోధనతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు కల్పిస్తామని వెల్లడించారు. మరోవైపు ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హనుమకొండలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పలువురు బీఆర్ఎస్ నాయకులను గృహ నిర్బంధంలో ఉంచారు.

సీతమ్మసాగర్‌కు అనుమతులు సాధించండి



ప్రజానావ, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించి, అసంపూర్తి పనులను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు సాధించి, నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రెండు జిల్లాలకు సంబంధించిన 15 కీలక అంశాలపై బుధవారం ఆయనతో సమావేశమై సమగ్రంగా చర్చించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోని జూలూరుపాడు టన్నెల్, పంప్‌హౌస్–4 పనులను వేగవంతం చేయాలని తుమ్మల సూచించారు. పెద్దవాగు ప్రాజెక్టు దెబ్బతిన్న కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌లో పైపుల ద్వారా సాగునీరు సరఫరా చేసే విధానానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. వెంకమ్మ చెరువు వరద ప్రవాహ కాలువకు అనుమతులు, మర్రేళ్లపాడు ఎత్తిపోతల పథకం, దోమలవాగు చెరువు సామర్థ్యం పెంపు అంశాలను కూడా ప్రస్తావించారు. రిజర్వాయర్లపై ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు.

మున్నేరుకు రక్షణ గోడ

ఖమ్మం నగరానికి వరద ముప్పు తగ్గించేందుకు మున్నేరు నదికి ధంసలాపురం వరకు రక్షణ గోడ నిర్మించాలని తుమ్మల ప్రతిపాదించారు. టేకులపల్లి వద్ద గైడ్‌వాల్ నిర్మాణం, ధంసలాపురం పెద్దచెరువు, ఖానాపురం ఊరచెరువు పునరుద్ధరణతోపాటు లకారం చెరువుకు నీటిని మళ్లించేందుకు రూ.8 కోట్లతో రెగ్యులేటర్ నిర్మించాలని సూచించారు. ఇటీవల భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న మల్లెపులవాగు కట్టలకు మరమ్మతులు చేపట్టి, భవిష్యత్తులో నష్టం జరగకుండా శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. భేతుపల్లి చెరువు సామర్థ్యాన్ని పెంచే అంశంపైనా దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మల ప్రతిపాదించిన 15 అంశాలపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. పెండింగ్ సమస్యలు, ప్రాజెక్టుల అనుమతులు, నిర్మాణ పనుల పురోగతిని పరిశీలిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



స్వచ్ఛ నగరంగా హైదరాబాద్

- జాతీయ స్థాయిలో గుర్తింపు
- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025–26లో తెలంగాణ నుంచి అవార్డు కైవసం
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా పురస్కారం

అందుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్ జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు సాధించింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2025–26'లో రాష్ట్రంలోనే తొలి 'స్వచ్ఛ నగరం'గా అవార్డును దక్కించుకుంది. స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్‌లో భాగంగా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో హైదరాబాద్ అత్యుత్తమ పనితీరు కనబరిచింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అవార్డును స్వీకరించారు. నగర పారిశుద్ధ్య ప్రమాణాల మెరుగుదల, పరిసరాల పరిశుభ్రత, ఘన వ్యర్థాల సమర్థ నిర్వహణలో హైదరాబాద్ చేపట్టిన చర్యలకు ఈ గుర్తింపు లభించింది. చెత్త సేకరణ, ప్రాసెసింగ్, పారిశుద్ధ్య వ్యవస్థల ఆధునీకరణలో అమలు చేసిన విధానాలు సత్ఫలితాలిచ్చాయి.

సమష్టి కృషికి గుర్తింపు

హైదరాబాద్‌కు జాతీయ పురస్కారం లభించడంపై జీహెచ్ఎంసీ హర్షం వ్యక్తం చేసింది. అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, క్షేత్రస్థాయి సిబ్బంది, నగర ప్రజల సమష్టి కృషితోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొంది. ఈ అవార్డు మరింత పరిశుభ్రమైన, పర్యావరణహితమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని అధికారులు తెలిపారు.

హైడ్రా కమిషనర్ కోర్టుకు రావాల్సిందే

- విచారణకు గైర్హాజరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- విచారణ మంగళవారానికి వాయిదా

ప్రజానావ, హైదరాబాద్: హైకోర్టు సమన్లు జారీ చేసినప్పటికీ విచారణకు హాజరుకాని హైడ్రా కమిషనర్ ఎన్.వి. రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్‌పై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వచ్చే మంగళవారం జరిగే విచారణకు ఇద్దరినీ స్వయంగా న్యాయస్థానం ఎదుట హాజరుపరచాలని డీజీపీ సీవీ ఆనంద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌ను ఆదేశించింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను న్యాయమూర్తి జస్టిస్ సి.వి. భాస్కర్‌రెడ్డి కొట్టివేశారు. శంషాబాద్ మండల పరిధిలోని భూ వ్యవహారంలో గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై హైకోర్టు ఈ ఇద్దరు అధికారులకు ఫారమ్–1 నోటీసులు జారీ చేసింది. నవంబర్ 11న విచారణకు హాజరుకావాలని ఆదేశించినప్పటికీ బుధవారం విచారణ సమయంలో వారు కోర్టుకు రాలేదు. పైగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వారు చూపిన కారణాలు సహేతుకంగా లేవని పేర్కొంటూ న్యాయమూర్తి ఆ పిటిషన్లను తిరస్కరించారు.

భూ స్వాధీనంపై కోర్టు ధిక్కరణ ఆరోపణలు

శంషాబాద్ గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబరు 626/2AAలో ఉన్న తన స్థలానికి సంబంధించి మహమ్మద్ తజమలుద్దీన్ అలియాస్ మొయినుద్దీన్ ఖాన్ గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై 2024 అక్టోబర్ 23న విచారణ జరిపిన న్యాయస్థానం.. సదరు భూమిని నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ అధికారులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఆ దరఖాస్తును పరిశీలించి, కారణాలతో కూడిన లిఖితపూర్వక ఉత్తర్వులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను అధికారులు పట్టించుకోకుండా, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే పోలీసులు, సిబ్బందితో వచ్చి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్కడి నిర్మాణాలను కూల్చివేసి, భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి ప్రభుత్వ ఆస్తిగా బోర్డులు ఏర్పాటు చేశారని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని వాదించడంతో కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో వచ్చే మంగళవారం రంగనాథ్‌ను డీజీపీ, తహసీల్దార్‌ను సైబరాబాద్ పోలీసు కమిషనర్ కోర్టుకు తీసుకువచ్చి హాజరుపరచాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

భూ రీ సర్వేలో పారదర్శకతకు పెద్దపీట

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు సమన్వయంతో, పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రీసర్వేతోపాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 22ఎ భూముల సమస్యలపై సమీక్షించారు. రీ సర్వే పూర్తయిన తర్వాత భూ యజమానులకు అభ్యంతరాలుంటే తెలియజేసేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాలపై రైతులకు వివరించాలని మంత్రి సూచించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాల్లో చాటింపు వేయాలని, కలెక్టర్లు స్వయంగా పర్యటించి సందేహాలు నివృత్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూమి విస్తీర్ణం, రీసర్వేలో గుర్తించిన విస్తీర్ణం వివరాలను భూ యజమానులకు వెంటనే తెలియజేయాలన్నారు.

వేగవంతంగా రీసర్వే.. ఎస్ఓపీలో మార్పులు

పాలేరు నియోజకవర్గంలోని 141 రెవెన్యూ గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు, రెండు రోవర్లు కేటాయించామని, 708 రోవర్లతో సర్వే కొనసాగుతోందని తెలిపారు. మరో వారం రోజుల్లో అదనంగా 400 రోవర్లను అందుబాటులోకి తెస్తామన్నారు. రీసర్వే నిర్వహణకు జారీ చేసిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) అమలులో ప్రాంతాలవారీగా తేడాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. క్షేత్రస్థాయి అధికారుల సూచనలు, అనుభవాల ఆధారంగా అవసరమైన మార్పులు చేసి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపారు. తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో అధికారులతో సమావేశమై సమస్యలు, పరిష్కారాలపై చర్చించినట్లు వివరించారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, ప్రభుత్వ భూములు, ఇతర వివాదాలపైనా సమీక్షలు నిర్వహించామన్నారు. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దుల విషయంలో గందరగోళం లేకుండా ఇరు శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి హద్దులు నిర్ధారించాలని కలెక్టర్లను ఆదేశించారు. రీసర్వేలో మంచి పనితీరు కనబరిచిన నల్గొండ, ఖమ్మం కలెక్టర్లను అభినందించగా, నిజామాబాద్ జిల్లాలో పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు సర్వే వేగవంతం చేయాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లు, 22ఎ సమస్యలపై ఆదేశాలు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హనుమకొండ జిల్లాల్లో ఇందిరమ్మ ఇవర్ల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించి ప్రతిపాదనలు పంపాలన్నారు. రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం ఏ దశలో ఉన్నా, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి ఇళ్లను కేటాయించాలని స్పష్టం చేశారు. 22ఎ భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ కొన్ని జిల్లాల్లో ఇబ్బందులు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రీసర్వే, గృహ నిర్మాణం, 22ఎ భూముల వ్యవహారాల్లో వేగం, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అండాల సేకరణ కేసులో

నిందితులకు పోలీస్ కస్టడీ

ప్రజానావ, హైదరాబాద్: నగరంలో వెలుగుచూసిన అక్రమ మానవ అండాల సేకరణ వ్యవహారంపై బేగంపేట పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితులను కోర్టు అనుమతితో బుధవారం జైలు నుంచి కస్టడీలోకి తీసుకున్నారు. గురువారం నుంచి ఐదు రోజుల పాటు వారిని విచారించనున్నారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టయిన దుర్గా ప్రసాద్‌ను కూడా పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ వ్యవహారంలో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 10కి చేరింది. అక్టోబర్ 31న వెలుగులోకి వచ్చిన ఈ అక్రమ దందాపై బేగంపేట, సరూర్‌నగర్, ఎల్బీనగర్ పోలీసులు మూడు వేర్వేరు కేసులు నమోదు చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్ శర్మ కీలకంగా వ్యవహరించినట్లు బేగంపేట పోలీసులు గుర్తించారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన పేద యువతులు, మహిళలకు డబ్బు ఆశ చూపి హైదరాబాద్‌కు తీసుకొచ్చి, మహిళా హాస్టల్‌లో ఉంచి అండాలు సేకరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.



ఫిలింనగర్‌లో మురుగునీటి సమస్యపై అధికారుల పరిశీలన

- బీజేవైఎం నాయకుడు దండుగుల శేఖర్ విజ్ఞప్తితో స్పందన
- గౌతమ్‌నగర్ చౌరస్తా వద్ద లీకేజీ పరిశీలన
- సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు జీఎం ప్రభాకర్ ఆదేశం



ప్రజానావ, హైదరాబాద్: ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ చౌరస్తా వద్ద వాటర్ గేట్‌వాల్ లీకేజీతో వినాయకనగర్ ప్రధాన రహదారిపై కలుషిత నీరు ప్రవహిస్తున్న సమస్యపై హెచ్ ఎండబ్ల్యూఎస్ఎన్‌బీ అధికారులు స్పందించారు. బీజేవైఎం నాయకుడు దండుగుల శేఖర్ విజ్ఞప్తి మేరకు జీఎం ప్రభాకర్, డీజీఎం శరత్ సిబ్బందితో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గేట్‌వాల్ నుంచి నీరు లీకవుతుండటంతో పక్కనే ఉన్న డ్రైనేజీ గ్రిల్ మట్టి, చెత్తతో పూర్తిగా నిండిపోయింది. ఫలితంగా మురుగునీరు, మట్టి కలిసిన నీరు రోడ్డుపై ప్రవహిస్తూ స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా బస్తీ వాసులు, పాదచారులు, పాఠశాలలకు వెళ్లే చిన్నారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన దండుగుల శేఖర్.. పరిస్థితిని వారికి ప్రత్యక్షంగా వివరించి, ప్రజలకు ఇబ్బందులు తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను పరిశీలించిన జీఎం ప్రభాకర్.. లీకేజీ, డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో బీజేపీ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని శేఖర్ పేర్కొన్నారు.

బ్యాటరీ వ్యర్థాల ఎగుమతిపై నిషేధం

- దేశీయ రీసైక్లింగ్‌కు ప్రోత్సాహం.. కీలక ఖనిజాల సేకరణే లక్ష్యం
- లిథియం, కోబాల్ట్, నికెల్ దిగుమతులపై ఆధారపడటం తగ్గించే యత్నం
- ఈ నెల 10 నుంచే అమల్లోకి వచ్చిన డీజీఎఫ్‌టీ ఉత్తర్వులు

న్యూఢిల్లీ: దేశీయంగా లిథియం–అయాన్ బ్యాటరీల వ్యర్థాల నుంచి కీలక ఖనిజాలను వెలికితీసే ప్రక్రియను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాటరీల రీసైక్లింగ్ ప్రక్రియలో లభించే 'బ్లాక్ మాస్' ఎగుమతులపై నిషేధం విధించింది. ఈ మేరకు విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ (డీజీఎఫ్‌టీ) నవంబర్ 10న ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు స్వేచ్ఛగా ఉన్న ఎగుమతి విధానాన్ని 'నిషేధిత' కేటగిరీలోకి మారుస్తూ తక్షణమే అమల్లోకి తెచ్చింది. దేశీయ రీసైక్లింగ్ పరిశ్రమకు ముడిసరుకు కొరత లేకుండా చూడటం, లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలక ఖనిజాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం.

ఏమిటీ బ్లాక్ మాస్?

వినియోగం ముగిసిన లిథియం–అయాన్ బ్యాటరీలు, బ్యాటరీల తయారీ సమయంలో మిగిలే వ్యర్థాలను ముక్కలుగా చేసి ప్రాసెస్ చేయగా లభించే పొడి పదార్థాన్ని బ్లాక్ మాస్ అంటారు. ఇందులో లిథియం, కోబాల్ట్, నికెల్, మాంగనీస్ వంటి విలువైన ఖనిజాలు ఉంటాయి. బ్యాటరీల రసాయన కూర్పును బట్టి గ్రాఫైట్ వంటి ఇతర పదార్థాలనూ తిరిగి వెలికితీయవచ్చు. ఎలక్ట్రిక్ వాహనాలు, విద్యుత్ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధన రంగాలకు ఈ ఖనిజాలు అత్యంత కీలకం. ఇదిలాఉంటే భారత్ పలు కీలక ఖనిజాల కోసం దిగుమతులపై గణనీయంగా ఆధారపడుతోంది. మరోవైపు దేశంలో బ్యాటరీ వ్యర్థాల రీసైక్లింగ్, వాటి నుంచి ఖనిజాలను శుద్ధి చేసే సామర్థ్యం పెరుగుతున్నప్పటికీ, తగినంత ముడిసరుకు అందుబాటులో లేకపోవడంతో పరిశ్రమలు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. దేశంలో ఉత్పత్తయ్యే బ్లాక్ మాస్ విదేశాలకు తరలిపోవడంతో కొన్నిసార్లు దేశీయ రీసైక్లింగ్



సంస్థలే విదేశాల నుంచి దాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఎగుమతులపై నిషేధంతో ఈ పరిస్థితికి అడ్డుకట్ట పడనుంది. పరిశ్రమలకు నిరంతర ముడిసరుకు సరఫరా, సామర్థ్య వినియోగం పెరుగుదలతోపాటు కొత్త పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కేంద్రం భావిస్తోంది.

దిగుమతి భారం తగ్గే అవకాశం

బ్లాక్ మాస్ నుంచి లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి ఖనిజాలను దేశీయంగానే వెలికితీయడం ద్వారా బ్యాటరీ తయారీ సంస్థలు విదేశీ సరఫరాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు. తద్వారా విదేశీ మారకద్రవ్యం ఆదా కావడంతోపాటు ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ తయారీ, ఇంధన నిల్వ, క్లీన్ ఎనర్జీ రంగాలకు అవసరమైన సరఫరా వ్యవస్థ బలోపేతం కానుంది. వినియోగించిన బ్యాటరీల నుంచి ఖనిజాలను తిరిగి సేకరించడం ద్వారా కొత్తగా గనుల తవ్వకాలపై ఆధారపడటం తగ్గుతుంది. ఇది వృత్తాకార ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీ), అర్బన్ మైనింగ్‌కు ఊతమివ్వనుంది. ప్రమాదకర వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పర్యావరణ నిబంధనల అమలుకూ దోహదపడుతుంది.

రూ.1,500 కోట్ల పథకానికి అనుసంధానం

ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఎన్‌సీఎంఎం) లక్ష్యాలకు ఈ నిర్ణయం తోడ్పడనుంది. ఇందులో భాగంగా రూ.1,500 కోట్ల ప్రోత్సాహక పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేస్తోంది. దేశీయంగా కీలక ఖనిజాల శుద్ధి, పునరుద్ధరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలన్న లక్ష్యానికి ఈ నిషేధం బలాన్నివ్వనుంది.

ఎగుమతులు లేవు.. అయినా ముందస్తు చర్య

గత ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి బ్లాక్ మాస్ ఎగుమతులు అసలు నమోదు కాలేదని జీటీఆర్ఐ వెల్లడించింది. అయినప్పటికీ భవిష్యత్తులో ఎగుమతులు ప్రారంభమై దేశీయ పరిశ్రమకు ముడిసరుకు కొరత ఏర్పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్య తీసుకుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. బ్లాక్ మాస్‌లో విషపూరిత ఎలక్ట్రోలైట్ అవశేషాలు, భారీ లోహాలు ఉండే అవకాశం ఉందని, వీటిని మరింత శుద్ధి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రమాదకర వ్యర్థాల రవాణాకు ముందస్తు అనుమతులు అవసరమైనప్పటికీ, కొందరు ఎగుమతిదారులు బ్లాక్ మాస్‌ను కోబాల్ట్ పౌడర్, నికెల్ ఉత్పత్తి మధ్యంతర పదార్థం లేదా ఇతర పారిశ్రామిక ఉత్పత్తులుగా పేర్కొంటూ నిబంధనలను తప్పించుకునే అవకాశం ఉందని జీటీఆర్ఐ హెచ్చరించింది. అందువల్ల కస్టమ్స్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించింది. పదార్థం ఎలా తయారైంది, ఎగుమతి పత్రాల్లో ఏ పేరుతో ప్రకటించారు అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడే నిషేధం సమర్థంగా అమలవుతుందని స్పష్టం చేసింది.

తండాల రహదారులకు మహర్దశ

- రూ.740 కోట్లతో అభివృద్ధి!
- వేములవాడ నియోజకవర్గానికి రూ.100 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ
- తొలి విడతలో రూ.40 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం
- రుద్రంగి, హనుమాన్ తండాలో రూ.8.07 కోట్ల పనులకు శ్రీకారం
- 3,500 ఇందిరమ్మ ఇళ్లకు నిధులు.. మరో 2వేల ఇళ్ల మంజూరుకు చర్యలు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ప్రజానావ, రుద్రంగి/కోనరావుపేట: అన్ని వర్గాల సంక్షేమం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. రుద్రంగి మండలంలో రూ.7.07 కోట్లు, కోనరావుపేట మండలం హనుమాన్ తండాలో రూ. కోటితో చేపట్టనున్న రహదారులు, అభివృద్ధి పనులకు బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. రుద్రంగి ప్రధాన రహదారి నుంచి కుక్కల గండి తండా వరకు రూ.4.57 కోట్లతో రోడ్డు, రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు, హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా సుమారు రూ.740 కోట్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. వేములవాడ నియోజకవర్గంలోని గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు రూ.100 కోట్ల కేటాయింపునకు చర్యలు చేపట్టామని, తొలి విడతగా రూ.40 కోట్లతో పనులకు నిధులు మంజూరు చేశామని చెప్పారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్లకు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తున్నామని, మరో 2,000 ఇళ్లు మంజూరు చేయడంతో పాటు 2029 నాటికి మరింత మంది పేదలకు సొంతింటి కల నెరవేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.

అర్హులకు కొత్త రేషన్ కార్డులు

అర్హులకు కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఎస్సీ గురుకులాలు, హాస్టళ్లలో మెరుగైన వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. వేములవాడ అభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఆయన సూచనల మేరకు గిరిజన తండాలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.



ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహణ

ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ శ్రీమతి గరిమా అగ్రవాల్ ఆదేశాల మేరకు, మానసిక దివ్యాంగుల, వికలాంగుల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని కోనరావుపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఏంజెలా ఆల్ఫ్రెడ్ నిర్వహించారు. ఈ శిబిరంలో మానసిక దివ్యాంగులైన విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి,వారి శారీరక మానసిక ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు డా.వెంకటరమణ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. సైకాలజిస్ట్ డా.అనూష విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసి, అవసరమైన కౌన్సెలింగ్, సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ, మానసిక దివ్యాంగులైన పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అవసరమైన వైద్య సేవలు, చికిత్సలు నిరంతరం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులలో గుర్తించిన ఆరోగ్య సమస్యలకు తగిన వైద్యం అందించడంతో పాటు, వారి ఆరోగ్య పరిరక్షణకు సంబంధిత శాఖల సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశి రామ్ ఎంపీడీవో సిద్ధ రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరమణ, సైకాలజిస్ట్ డా.అనూష, ప్రోగ్రామ్ అధికారులు డా.రామకృష్ణ, డా.సంపత్ కుమార్, వైద్యాధికారి డా.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

34వ సారి మోతె రాజిరెడ్డి రక్తదానం

ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లికి చెందిన బొజ్జ లక్ష్మి కాలు శస్త్రచికిత్స నిమిత్తం రక్తం అవసరం కావడంతో, స్పందించిన రెడ్ డ్రాప్ సభ్యుడు, టీడీపీ వేములవాడ నియోజకవర్గ అడాహాక్ కమిటీ సభ్యుడు మోతె రాజిరెడ్డి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏ పాజిటివ్ (ఏ+) రక్తాన్ని 34వ సారి దానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని, రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.

దత్తత తీసుకున్నారు.. అభివృద్ధి మరిచారు!

- 22ఏళ్లుగా ఎదురుచూపులే.. మామిడిపల్లి రామాలయానికి మోక్షమెప్పుడు?
- కొండపై కొలువైన రామయ్యకు అభివృద్ధి కరువు
- వేములవాడ దేవస్థానం దత్తత తీసుకున్నా నేటికీ కానరాని మౌలిక వసతులు

ప్రజానావ, కోనరావుపేట: ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న పాలకులు.. దత్తత తీసుకున్న దేవాలయాల అభివృద్ధిని మాత్రం విస్మరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోకి దత్తత తీసుకుని 22 సంవత్సరాలు గడుస్తున్నా, ఆలయం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోకపోవడం భక్తులను, గ్రామస్థులను నిరాశకు గురిచేస్తోంది.

అరకొర సౌకర్యాలతో భక్తుల ఇబ్బందులు

ప్రకృతి ఒడిలో కొండపై కొలువుదీరిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. నిత్యం భక్తులు దర్శనానికి వస్తుంటారు. అయితే ఆలయానికి అవసరమైన మౌలిక వసతులు, మెరుగైన సదుపాయాలు కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆలయ పరిసరాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, మరుగుదొడ్లు నీటి వసతిఇతర అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.





పేరుకే దత్తత.. అభివృద్ధి ఎప్పుడో?



వేములవాడ దేవస్థానం దత్తత తీసుకున్న తర్వాత ఆలయం రూపురేఖలు మారుతాయని, పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతుందని ఆశించాం. కానీ దశాబ్దాలు గడుస్తున్నా ఆ ఆశలు నెరవేరడం లేదు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, వేములవాడ దేవస్థాన అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. పాలకులు, అధికారులు స్పందించి మామిడిపల్లి రామాలయానికి పూర్వవైభవం తేవాలి.

– శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తుడు

ఎమ్మెల్యే ఆదేశాలకే దిక్కులేదు



వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాఘమాస జాతర సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సమావేశంలో గుట్టపై నీటి ట్యాంకు, రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ ఆదేశాలు ఇప్పటివరకు అమలు కాలేదు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీలను సైతం అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం. ప్రజాప్రతినిధుల ఆదేశాలనే బేఖాతరు చేస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. వెంటనే పనులు ప్రారంభించి గ్రామస్తుల సమస్యలను పరిష్కరించాలి.

– సుదర్శన్ రెడ్డి, గ్రామస్తుడు



బీహార్ రాష్ట్ర గవర్నర్ రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నైన్ బుధవారం సాయంత్రం లోక్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు గవర్నర్లు పలు అంశాలపై పరస్పరం చర్చించుకున్నారు.

– ప్రజానావ, హైదరాబాద్





వైఫై స్పీడ్ ఇలా పెంచండి

స్లో నెట్‌వర్క్‌తో పనులకు ఆటంకం

• ఇంటి నుంచే పనిచేసేవారికి మరింత ఇబ్బందులు • రూటర్‌ను పునఃప్రారంభిస్తే వేగం పెరిగే అవకాశం
• సరైన చోట అమర్చితే మెరుగైన సంకేతాలు • అనవసర పరికరాల అనుసంధానానికి స్వస్తి చెబితే సరి

ఈ డిజిటల్ యుగంలో చదువు, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ప్రతి పనికీ అంతర్జాలమే ఆధారం. ముఖ్యంగా ఇంటి నుంచే విధులు నిర్వహించే ఉద్యోగులకు వేగవంతమైన వైఫై ఎంతో అవసరం. అయితే ఒక్కోసారి వైఫై వేగం తగ్గి పనులకు ఆటంకం కలిగిస్తుంది. ముఖ్యమైన సమావేశాలు, సమాచార బదిలీలు, ఇతర ఆన్‌లైన్ కార్యకలాపాలు నెమ్మదించడంతో విలువైన సమయం వృథా అవు తుంది. ఈ సమస్యకు ప్రతిసారీ కొత్త పరికరాలు కొనాల్సిన అవస రం లేదు. ఇంట్లోనే కొన్ని చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా వైఫై వేగాన్ని మెరుగుపరచు కోవచ్చని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. ఆ చిట్కాలే మిటంటే..

ముందుగా రూటర్‌ను పునఃప్రారంభించాలి

వైఫై రూటర్ ఎక్కువ సమయం నిరంతరాయంగా పనిచేస్తుంటే కొన్నిసార్లు సాంకేతిక సమస్యలు తలెత్తవచ్చు. అలాంటప్పుడు రూటర్‌ను కొద్దిసేపు ఆపి, మళ్లీ ఆన్ చేయాలి. ఇలా పునఃప్రారం భించడం వల్ల తాత్కాలిక లోపాలు తొలగి, అంతర్జాల వేగం మెరు గుపడే అవకాశం ఉంటుంది.

సరైన చోట అమర్చడం ముఖ్యం

వైఫై వేగం, సంకేతాల ప్రసారంపై రూటర్ ఉండే ప్రదేశం ప్రభావం చూపుతుంది. అందుకే ఇంటి మధ్య భాగంలో, కొంత ఎత్తైన ప్రదే శంలో దాన్ని అమర్చడం మంచిది. ఇలా చేస్తే ఇంటిలోని అన్ని గదులకూ సంకేతాలు మెరుగ్గా చేరుతాయి.

గోడల వెనుక ఉంచొద్దు

రూటర్‌ను గోడల పక్కన, మూసి ఉన్న గదుల్లో, బరువైన వస్తువుల వెనుక ఉంచకూడదు. వీటివల్ల వైఫై సంకేతాల ప్రసారానికి ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా కొన్ని గదుల్లో అంతర్జాల వేగం తగ్గిపోతుంది. అందువల్ల రూటర్ చుట్టూ ఖాళీ ప్రదేశం ఉండేలా చూసుకోవాలి.

అనవసర అనుసంధానాలకు కళ్లెం

ఒకేసారి ఎక్కువ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర పరికరాలు వైఫైకి అనుసంధానమైతే అందుబాటులో ఉన్న వేగం వాటి మధ్య పంచుకోవాల్సి వస్తుంది. దీంతో వేగం తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే రూటర్‌కు అనుసంధానమైన పరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, అవసరం లేని వాటి అనుసంధానాన్ని తొలగించాలి.

చిన్న మార్పులతోనే మెరుగైన వేగం..

వైఫై వేగం తగ్గిన ప్రతిసారీ అంతర్జాల సేవల సంస్థదే తప్పని భావించకూడదు. రూటర్ పనితీరు, దాని స్థానం, అనుసంధానమై న పరికరాల సంఖ్యను కూడా పరిశీలించాలి. ఈ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే ఇంట్లోనే అంతర్జాల వేగాన్ని మెరుగుపరచు కోవచ్చు.





వన్‌ప్లస్ ఫోన్లకు కొత్త కళ!

• ఆండ్రాయిడ్ 17 ఆధారంగా కలర్ ఓఎస్ 17 విడుదల • ఇప్పటికే 13ఆర్ మోడల్‌కు అందుబాటులోకి..
• ఈ నెలాఖరులోగా మరో ఐదు పరికరాలకు విస్తరణ • నవంబర్ 24న వన్‌ప్లస్ ఓపెన్‌కు కొత్త రూపు
• దశలవారీగా నవీకరణలు.. వినియోగదారులకు కంపెనీ సూచనలు

వన్‌ప్లస్ వినియోగదారులకు శుభవార్త. ఆండ్రాయిడ్ 17 ఆధారంగా రూపొందించిన సరికొత్త కలర్ ఓఎస్ 17ను మరిన్ని పరికరాలకు అందించేందుకు కంపెనీ సిద్ధమైంది. నవంబర్ నెలలో కొత్త సాఫ్ట్‌వేర్ నవీకరణల ను విడుదల చేసే ప్రణాళికను ప్రకటించింది. ఇప్పటికే వన్‌ప్లస్ 13ఆర్ నమూనాకు ఈ నవీకరణ అందించగా.. ఈ నెలాఖరులోగా మరో ఐదు పరికరాలకు అందుబా టులోకి తీసుకురానుంది. నవంబర్ 5న వన్‌ప్లస్ సమాజ వేదికలో ఈ వివరాలను వెల్లడించింది. వన్‌ప్లస్ తన పా త ఆక్సిజన్ ఓఎస్ నుంచి కలర్ ఓఎస్‌కు మారే ప్రక్రియ ను ప్రారంభించింది. ఈ కొత్త వెర్షన్‌ను తొలుత వన్‌ప్లస్ 15 ఫోన్‌కు స్థిరమైన రూపంలో అందించింది. తాజాగా పాత నమూనాలకూ విస్తరిస్తోంది. ఇప్పటికే నవంబర్ 5న వన్‌ప్లస్ 13ఆర్‌కు నవీకరణ విడుదలైంది. వన్‌ప్లస్ 12కు, ఆ మరుసటి రోజు వన్‌ప్లస్ ప్యాడ్ 3కు అందించ నుంది. కంపెనీ తొలి మడత ఫోన్ వన్‌ప్లస్ ఓపెన్‌కు న వంబర్ 24న, మధ్యశ్రేణి నమూనాలైన నార్డ్ 6, నార్డ్ సీఈ 6లకు నవంబర్ 26న అందుబాటులోకి రానుంది.

దశలవారీగా విడుదల

అన్ని పరికరాలకూ ఒకేసారి నవీకరణ అందదని కం పెనీ స్పష్టం చేసింది. ప్రాంతం, ఫోన్ నమూనాను బట్టి విడుదల తేదీలు మారవచ్చని తెలిపింది. ఎలాంటి సాం కేతిక సమస్యలు తలెత్తకుండా, వినియోగదారులందరికీ సాఫీగా అందించేందుకు దశలవారీ విధానాన్ని అనుసరి స్తోంది. అందువల్ల ఒకే నమూనా ఫోన్ వాడుతున్నప్ప టికీ, అందరికీ ఒకే రోజు కొత్త సాఫ్ట్‌వేర్ అందకపోవ చ్చు. ఇప్పటికే 13ఆర్ ఫోన్ వాడుతున్నవారికి నవీకరణ కనిపించకపోతే మరికొన్ని రోజులు వేచి చూడాలని సూచించింది.

నవీకరణను ఎలా తెలుసుకోవాలి?

- కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చిందో లేదో తెలుసు కునేందుకు వినియోగదారులు తమ ఫోన్‌లోని అమరి కల విభాగాన్ని పరిశీలించాలి. ఇందుకోసం ఈ కింది చర్యలు చేపట్టాలి.
- ముందుగా ఫోన్‌లోని అమరికల విభాగంలోకి వెళ్లా లి. అక్కడ వ్యవస్థ, నవీకరణలు అనే విభాగాన్ని ఎంచు కోవాలి.
- అనంతరం సాఫ్ట్‌వేర్ నవీకరణపై నొక్కాలి
- కొత్త కలర్ ఓఎస్ 17 అందుబాటులో ఉంటే తెరపై కనిపిస్తుంది. అప్పుడు దిగుమతి, స్థాపన ఎంపికను ఎంచుకుంటే నవీకరణ ప్రక్రియ పూర్తవుతుంది.
- కొత్త నవీకరణకు సంబంధించిన తాజా వివరాల కోసం అధికారిక ప్రకటనలను గమనించాలని కంపెనీ సూచించింది. కొన్నిసార్లు అధికారిక ప్రకటన వెలువడక ముందే నవీకరణ నేరుగా ఫోన్‌కు చేరే అవకాశం ఉంద ని తెలిపింది.





ప్రభుత్వ విప్ ఆదికి గాయం

ప్రజానావ, వేములవాడ: వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాలికి తీవ్ర గాయమైంది. బుధవారం జగిత్యాల జిల్లా వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండలం ఇప్పపల్లిలో పాల్గొన్న ఓ కార్యక్రమంలో కాలికి ఫ్లెక్సీ బాండ్ అంటుకొని తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ విప్‌ని వేములవాడ లోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాలికి అంటుకున్న ఫ్లెక్సీ బాండ్ ను వైద్యులు తొలగించి చికిత్స చేశారు. విషయం తెలుసుకున్న కార్యకర్తలు ఆసుపత్రికి చేరుకుని ఆదిని పరామర్శించారు. ఆది శ్రీనివాస్‌కు గాయమైన విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఫోన్‌లో ఆది శ్రీనివాస్‌ను వివరాలు అడిగి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

భీమేశ్వరాలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం

- ప్రారంభించిన ఆలయ ఈవో రమాదేవి



ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు దీపోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి రమాదేవి ప్రారంభించారు. 2026 నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు కార్తీక మాస ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో సామూహిక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ముత్తైదువులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, రాధ, నూగురి నరేందర్, ఆలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజన్న అన్నదాన ట్రస్టుకు విరాళం



ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు వరంగల్‌కు చెందిన వేముల సువర్ణ–నాగరాజు దంపతులు రూ.1,00,001 విరాళంగా అందజేశారు. బుధవారం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో పీఆర్ఓ పెరిక శ్రీనివాస్‌కు నగదు రూపంలో విరాళాన్ని అందించారు. అనంతరం దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

కాలేజీల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి



ప్రజానావ, సిరిసిల్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం టిఆర్ఎస్వి నాయకుల ఆధ్వర్యంలో ఇంటర్ విద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బల్యాల ప్రవీణ్, మారం కార్తికేయ పటేల్, ఎండి సమీర్, వినయ్, ఆకాష్, అఖిల్ వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

చదువే విద్యార్థి ప్రగతికి ఆధారం

- విద్యార్థి దశ నుంచే ప్రణాళిక ప్రకారం అభ్యసించాలి
- ఆదర్శమూర్తులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పెద్దూర్ ఎంపీహెచ్ఎస్‌లో స్మార్ట్ క్లాస్ రూమ్ ప్రారంభం

ప్రజానావ, సిరిసిల్ల: విద్యార్థి ప్రగతికి చదువే ఆధారంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 20 పాఠశాలల్లో హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద (సీఎస్ఆర్) ఇటీవల స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయగా, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ ఎంపీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బుధవారం హాజరై ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వ్యక్తి వికాసం, అభివృద్ధికి చదువు ఒక ఆయుధంగా ఉపయోగ పడుతుందని వివరించారు. ఎందరో ఆదర్శ వ్యక్తులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. బీఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఏపీజే అబ్దుల్ కలాం వారి విద్యాభ్యాస కాలంలో ఎన్నో కష్టాలు పడి ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేశారని, దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించారని కొనియాడారు. అలాగే ఇన్ఫోసిస్ చైర్మన్ నారాయణమూర్తి భార్య సుధా మూర్తి విద్యాభ్యాసం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆదర్శమూర్తుల ఉన్నతమైన విలువలు, దేశానికి, సమాజానికి అందించిన సేవలను ప్రతి విద్యార్థి స్ఫూర్తిదాయకంగా తీసుకొని ప్రణాళిక ప్రకారం చదవాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తాము పుట్టిన ప్రాంతం, మాట్లాడే భాష, ఆర్థిక పరిస్థితి, కుటుంబ నేపథ్యం ఏవీ కూడా ఉన్నత విద్యాభ్యాసానికి అడ్డు రావని, ప్రతిభ చూపేందుకు అడ్డంకులు కావని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించి మంచిగా చదివి తాము అనుకున్న ఉన్నత ఉద్యోగాలు, స్వయం ఉపాధి, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థితో మార్పు సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, తహసీల్దార్ మహేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బాధ్యులు శ్రావణ్ కుమార్, నాగేశ్వరరావు, కమలాకర్, మండల విద్యాధికారి దూస రఘుపతి, కాంప్లెక్స్ హెచ్ఎం మోతిలాల్, ఏపీసీ చైర్‌పర్సన్ తిప్పవరం సుధ, హెచ్ఎం చక్రవర్తుల రమాదేవి, వార్డు కౌన్సిలర్ లింగంపల్లి భాగ్యలక్ష్మి, దొంతినేని కళ్యాణి తదితరులు ఉన్నారు.



20 పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 20 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.కోటి వ్యయంతో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో ఒక్కో పాఠశాలలో ఒక గదికి రంగులు వేసి, నాలుగు ఫ్యాన్లు, లైట్లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, 10 డెస్క్‌లు, యూపీఎస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, చందుర్తి, వేములవాడ, వేములవాడ రూరల్, కోనరావుపేట, రుద్రంగి మండలాల్లోని ఎంపీపీఎస్, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈ సౌకర్యాలు కల్పించారు. వీటిలో రాజీవ్ నగర్ ఎంపీహెచ్ఎస్, తారకరామనగర్ ఎంపీపీఎస్, తంగళ్లపల్లి, బద్దెనపల్లి, లింగన్నపేట, గొల్లపల్లి, బొప్పాపూర్, మల్యాల, రుద్రవరం, నూకలమర్రి తదితర పాఠశాలలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వ విద్యా సంస్థలు, ఆసుపత్రుల్లో సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటికే యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో రూ.22 లక్షలతో 145 బెడ్లు, పరుపులు ఏర్పాటు చేశారు. త్వరలో పలు ఆసుపత్రులు, అంగన్‌వాడీల్లోనూ సౌకర్యాల కల్పన చేపట్టనున్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

స్వాతంత్ర సమర యోధుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ విద్యా వ్యవస్థ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు.



60ఏళ్ల తర్వాత!



ప్రజానావ, వేములవాడ: జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న చందనోత్సారణ, మహా సంప్రోక్షణ మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎల్. రమాదేవికి కొండగట్టు ఆలయ అధికారులు అందజేశారు. కొండగట్టు ఆలయ ఏఈవో హరిహరనాథ్, ఉప ప్రధాన అర్చకులు లక్ష్మణ ప్రసాద్ వేములవాడలో ఈవోను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. సుమారు 60 ఏళ్లుగా స్వామివారి మూలమూర్తిపై పేరుకుపోయిన చందనాన్ని తొలగించే విశేష ఘట్టం ఈ మహోత్సవాల్లో జరగనుంది. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు జీయర్ స్వామివారి దివ్య సమక్షంలో ప్రత్యేక జపాలు, హోమాలు, వేద పారాయణాలు నిర్వహించనున్నారు. నవంబర్ 20న ఉదయం 9.57 గంటలకు కుంభ ప్రోక్షణ, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం స్వామివారి నిజరూప దర్శనం ప్రారంభమవుతుంది. చందనోత్సారణ ప్రక్రియ కారణంగా ఉత్సవాల సమయంలో మూలమూర్తి దర్శనం నిలిపివేయనున్నారు. మహా సంప్రోక్షణ అనంతరం డిసెంబర్ 29 వరకు 40 రోజుల పాటు భక్తులకు స్వామివారి నిజరూప దర్శన భాగ్యం కల్పించనున్నారు. ఈ విశేష ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అంజన్న స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు.

- కొండగట్టు అంజన్నకు చందనోత్సారణ మహోత్సవం
- ఈనెల 15 నుంచి 20 వరకు మహా సంప్రోక్షణ వేడుకలు
- 40రోజుల పాటు భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం

బియ్యం ఇవ్వని మిల్లర్లపై చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ కార్యాలయంలో సీపీఐ నేతల వినతిపత్రం



ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం తిరిగి ఇవ్వని రైస్ మిల్లులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల నియోజకవర్గం సిపిఐ నాయకులు గుంటి వేణు, పంతం రవిలు కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో 84 రైసు మిల్లలు నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకా యిలు లెక్కలు తేల్చి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడమే కాకుండా రైస్ మిల్లుల యజమా నుల ఆస్తులను కూడా చట్టపరంగా జప్తు చేయాలని కోరారు. తమకు సమాచారం ఉన్న మేరకు 85 ఎస్ కెల బియ్యం రైస్ మిల్లులు బకాయి ఉన్నారని తెలి సిందన్నారు. సుమారు 04 లక్షల 34 వేల 700 బ స్తాల బియ్యం బకాయి ఉందన్నారు. ప్రభుత్వాన్ని మోసం చేసి రైస్ మిల్లు యజమానులు బియ్యం అమ్ముకోవడం చట్టపరంగా నేరమన్నారు. ముస్తాబా ద్ మండల కేంద్రంలోని ఒక రైస్ మిల్ 169 ఎస్ కె ల బియ్యం దీని విలువ సుమారు రూ. 20 కోట్లు పైనే ఉండగా తిరిగి ప్రభుత్వానికి ఇవ్వకుండా కాల యాపన చేస్తున్నప్పటికీ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఈ డిఫాల్టర్ రైస్ మిల్లుల యజమానులు అమ్ముకున్న బియ్యం తో వారు అక్రమంగా ఆస్తులను కొనుగోలు చేసుకున్నారన్నారు. వీరి అక్రమాలపై సిబిఐతో విచారణ జరిపించి కఠిన చర్యలు చేపట్టాలని సిపిఐ సిరిసిల్ల నియోజక వర్గం నాయకులు గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు మీసం లక్ష్మణ్, కుర్ర రాకేష్, ఎన్ శ్రీనివాసులు కోరారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ నూతన మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల కష్టసుఖాల్లో పాలుపంచుకొని రైతుల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పనిచేయాలని సూచించారు.

– ప్రజానావ, ఎల్లారెడ్డిపేట

మహిళల భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



- జిల్లా షీ టీమ్స్, ఏహెచ్‌టీయూ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు

ప్రజానావ, సిరిసిల్ల: జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్ టియు) బృందం ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని సహస్ర జూనియర్ కళశాలలో షీ టీమ్, ఏహెచ్ టియు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలపాలని అధికారులు సూచించారు. బాలికల, విద్యార్థుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా, వేధింపులకు గురిచేసినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేధింపులకు గురైన విద్యార్థినులు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీమ్ కి ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ అవసరమైన రక్షణ, సహాయం అందిస్తామని భరోసా కల్పించారు.

ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వివిధ రూపాల్లో జరుగుతున్నాయని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, సోషల్ మీడియా పరిచయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకింగ్ సమాచారం ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఏ ఎస్ ఐ ప్రమీల, షీ టీం సిబ్బంది, ఏహెచ్ టియు సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీలు

- విజేతలకు బహుమతులు అందజేత

ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెలలోని బీజేఆర్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నవంబర్ 11న జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026–27 కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల రహిత భారతదేశం అనే అంశంపై వివిధ కళాశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన దీప్తి రాయ్ మొదటి బహుమతి, ఎస్.కె. రామిజ్ రాజా రెండో బహుమతి, సీహెచ్. అవినాష్ రెడ్డి మూడో బహుమతి సాధించారు. విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా యువజన అధికారి గోలీ తిరుపతి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఉపేందర్, మై భారత్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఎన్విడియా పగ్గాలు ఎవరికి?
రేసులో భారతీయుడు!

- జెన్సన్ హువాంగ్ స్థానంపై చర్చలు.. తెరపైకి జై పురీ, కొలెట్ క్రెస్

న్యూఢిల్లీ: చైనాకు గూఢచర్యం చేస్తున్నారనే అనుమానాలున్న మహిళతో సంబంధాల వ్యవహారం ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్‌ను చుట్టుముట్టడంతో ఆ సంస్థ నాయకత్వంపై చర్చ మొదలైంది. ఈ వ్యవహారంపై కంపెనీ బోర్డు స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించగా, అమెరికా దర్యాప్తు సంస్థల పరిశీలన కూడా కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్విడియా షేర్లు గణనీయంగా పడిపోయాయి. ఒకవేళ హువాంగ్ పదవి నుంచి తప్పుకోవాల్సి వస్తే సంస్థ పగ్గాలు ఎవరికి అప్పగిస్తారన్న అంశంపై ఇన్వెస్టర్లు, మార్కెట్ వర్గాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ రేసులో భారత సంతతికి చెందిన మాజీ సేల్స్ విభాగం అధిపతి జై పురీ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఎన్విడియా సీఎఫ్‌వో కొలెట్ క్రెస్‌తో పాటు మరికొందరు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల పేర్లూ పరిశీలనలో ఉన్నట్లు పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే, సంస్థ ఇప్పటివరకు ఎవరినీ వారసుడిగా ప్రకటించలేదు. హువాంగ్ సీఈవోగా కొనసాగుతారని కంపెనీ బోర్డు స్పష్టం చేసింది.

అనుభవమే జై పురీకి బలం

ఎన్విడియాలో రెండు దశాబ్దాలకు పైగా పనిచేసిన జై పురీకి సంస్థ వ్యాపార కార్యకలాపాలపై విశేష అనుభవం ఉంది. 2009లో వరల్డ్‌వైడ్ ఫీల్డ్ ఆపరేషన్స్‌కు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. గ్లోబల్ సేల్స్, వ్యాపార అభివృద్ధి, వ్యూహాత్మక భాగస్వామ్యాలు, కీలక వినియోగదారులతో సంబంధాల నిర్వహణ వంటి విభాగాలను పర్యవేక్షించారు. ఈ అనుభవం నాయకత్వ బాధ్యతలు చేపట్టేందుకు ఆయనకు అనుకూలతగా భావిస్తున్నారు. 2026 ఆగస్టు 24న ఆయన కార్యనిర్వాహక బాధ్యతల నుంచి వైదొలిగారు. అయితే, అధికారాల బదిలీ ప్రక్రియలో భాగంగా సీనియర్ సలహాదారుగా కొనసాగుతారని కంపెనీ నియంత్రణ సంస్థలకు సమర్పించిన పత్రాల్లో వెల్లడించింది. పదవీ విరమణ చేసిన నేపథ్యంలో ఆయన సీఈవోగా ఎంపికవుతారా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉంది. ఎన్విడియా ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న సీఎఫ్‌వో కొలెట్ క్రెస్ పేరు కూడా నాయకత్వ మార్పు చర్చల్లో వినిపిస్తోంది.

అన్నదాతకు కేంద్రం అండ

రబీ సీజన్‌కు రూ.62,370 కోట్ల రాయితీ

- గతేడాది కంటే రూ.24,417 కోట్లు అధికంగా సబ్సిడీ • డీఏపీ బస్తా ధర యథాతథం.. రూ.1,350గానే విక్రయం
- అంతర్జాతీయ సంక్షోభం ప్రభావం రైతులపై పడకుండా చర్యలు • సల్ఫర్ ఉత్పత్తికి ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు మండిపోతున్నా.. ఆ భారం దేశీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం భారీ సబ్సిడీకి తెరతీసింది. 2026–27 రబీ సీజన్‌కు ఫాస్ఫేటిక్, పొటాషిక్ (పీ అండ్ కే) ఎరువులపై ఏకంగా రూ.62,370.02 కోట్ల రాయితీని ప్రకటించింది. గత ఏడాది ఇదే సీజన్‌తో పోలిస్తే ఈసారి రూ.24,417.73 కోట్ల అదనపు సబ్సిడీని అందించనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అంతర్జాతీయంగా ముడిసరుకుల ధరలు పెరిగినప్పటికీ రైతులకు ఎరువులను అందుబాటు ధరల్లో అందించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా 50 కిలోల డీఏపీ బస్తా ధరను రూ.1,350గానే కొనసాగించాలని నిర్ణయించింది. పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) పథకం కింద 2026 అక్టోబర్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు అమలయ్యే రాయితీ రేట్లను కూడా కేంద్రం ఖరారు చేసింది. ఇందులో భాగంగా నత్రజని కిలోకు రూ.94.21, భాస్వరం కిలోకు రూ.66.11, సల్ఫర్ కిలోకు రూ.10.42 చొప్పున సబ్సిడీ ఇవ్వనుంది. పొటాష్‌పై కిలోకు రూ.2.38 రాయితీని యథాతథంగా కొనసాగించనుంది. డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ, ఎన్‌పీకే, ఎన్‌పీకేఎస్ తదితర ఎరువులకు ఈ పథకం వర్తిస్తుంది. ఖరీఫ్, రబీ సీజన్ల అవసరాలకు అనుగుణంగా ఏడాదికి రెండుసార్లు ప్రభుత్వం సబ్సిడీ రేట్లను నిర్ణయిస్తుంది.

యుద్ధాల ప్రభావం లేకుండా..

పశ్చిమాసియా సంక్షోభం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ఎరువులు, వాటి తయారీకి అవసరమైన ముడిసరుకుల ధరలు పెరిగాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పరిణామాల వల్ల దేశీయ రైతులపై అదనపు భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గత రబీ సీజన్‌తో పోలిస్తే ఈసారి సబ్సిడీ కేటాయింపులు



గణనీయంగా పెంచినట్లు వివరించారు.

బడ్జెట్ కేటాయింపులకు మించి..

2026–27 ఆర్థిక సంవత్సరానికి యూరియా, పోషక ఆధారిత సబ్సిడీ పథకాల కోసం కేంద్ర బడ్జెట్‌లో మొత్తం రూ.1,70,799 కోట్లు కేటాయించారు. ఇందులో యూరియాకు సుమారు రూ.1.16 లక్షల కోట్లు, ఇతర ఎరువులకు రూ.54 వేల కోట్లు కేటాయించారు. అయితే ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి పీ అండ్ కే ఎరువుల సబ్సిడీ మొత్తం ఇప్పటికే రూ.1,03,903 కోట్లకు చేరింది. ఇది తొలుత కేటాయించిన రూ.54వేల కోట్లకు దాదాపు రెట్టింపు. 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు యూరియా సబ్సిడీ కింద రూ.85,585 కోట్లు, పోషక ఆధారిత ఎరువుల కోసం రూ.33,664 కోట్లు ఖర్చు చేశారు. మొత్తంగా ఈ రెండు విభాగాలపై రూ.1.19 లక్షల కోట్ల వ్యయం నమోదైంది. వార్షిక బడ్జెట్‌లో యూరియా కేటాయింపుల్లో 73 శాతం, ఎన్‌బీఎస్ కేటాయింపుల్లో 62 శాతం ఇప్పటికే వినియోగమయ్యాయి. మిగిలిన ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.51,500 కోట్లు మాత్రమే అందుబాటులో ఉండగా, రబీ సీజన్ ఎన్‌బీఎస్ సబ్సిడీకే రూ.62,370 కోట్లు అవసరం కావడం గమనార్హం.

దేశీయ ఉత్పత్తికి ప్రోత్సాహకాలు

ఎరువుల తయారీలో కీలకమైన సల్ఫర్, సల్ఫ్యూరిక్ యాసిడ్ దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహక ప్యాకేజీకి కూడా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సల్ఫర్ తయారీదారులకు వాస్తవ కొనుగోలు వ్యయంలో 20 శాతం మేర ప్రోత్సాహకం అందించనుంది. ఇందుకు టన్నుకు కనీస ధరను 800 డాలర్లుగా నిర్ణయించింది. సల్ఫ్యూరిక్ యాసిడ్ తయారీదారులకు కూడా కొనుగోలు వ్యయంలో 20 శాతం మేర, టన్నుకు కనీసం 266.67 డాలర్ల ధర ఆధారంగా ప్రోత్సాహకం ఇవ్వనుంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ఎరువుల శాఖ త్వరలో విడుదల చేయనుంది.

ఆశాజనకంగా ఎరువుల నిల్వలు

దేశంలో ఎరువుల నిల్వలు గత ఏడాదితో పోలిస్తే మెరుగ్గా ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. నవంబర్ 10 నాటికి యూరియా నిల్వలు 103.12 లక్షల టన్నులకు చేరాయి. గత ఏడాది ఇదే సమయానికి 72.14 లక్షల టన్నులే ఉన్నాయి. డీఏపీ నిల్వలు 28.65 లక్షల టన్నుల నుంచి 28.65 లక్షల టన్నులకు కాకుండా గత ఏడాది 24.86 లక్షల టన్నుల నుంచి ప్రస్తుతానికి 28.65 లక్షల టన్నులకు పెరిగాయి.

ఎన్‌పీకే నిల్వలు 42.44 లక్షల టన్నుల నుంచి 60.87 లక్షల టన్నులకు, ఎంఓపీ నిల్వలు 10.78 లక్షల టన్నుల నుంచి 20.08 లక్షల టన్నులకు చేరాయి. అయితే ఎస్ఎస్‌పీ నిల్వలు మాత్రం స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది 23.24 లక్షల టన్నులుగా ఉండగా, ప్రస్తుతం 22.49 లక్షల టన్నులుగా నమోదయ్యాయి.

ప్రత్యామ్నాయాలపై దృష్టి

డీఏపీపై ఆధారపడటాన్ని తగ్గించడంతోపాటు తక్కువ ధరలో లభించే సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) వినియోగాన్ని ప్రోత్సహించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎస్ఎస్‌పీకి రవాణా సబ్సిడీని కొనసాగించనుంది. దిగుమతి, దేశీయ ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ (టీఎస్‌పీ), దిగుమతి మోనో అమ్మోనియం ఫాస్ఫేట్ (ఎంఏపీ)కు సంబంధించిన ప్రత్యేక రాయితీలను కూడా పొడిగించింది. దిగుమతి, దేశీయ అమ్మోనియం సల్ఫేట్‌పై సబ్సిడీని రబీ సీజన్‌లో కొనసాగించనుంది. ఈ నిర్ణయాలు ఎరువుల లభ్యతను పెంచడంతోపాటు సమతుల్య పోషకాల వినియోగానికి దోహదపడతాయని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఏఐ) చైర్మన్ ఎస్.శంకరసుబ్రమణియన్ పేర్కొన్నారు. దేశీయ ఉత్పత్తి పెంపు, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా ఎరువుల రంగంలో స్వావలంబన సాధించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.



ముద్ర రుణాలకు భరోసా

- మరో ఐదేళ్లు కొనసాగనున్న క్రెడిట్ గ్యారంటీ పథకం
- 2031 మార్చి వరకు పొడిగింపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- రూ.5 వేల కోట్లతో రూ.12.6 లక్షల కోట్ల రుణాలకు భరోసా
- ఇప్పటివరకు 60.36 కోట్ల మందికి రూ.43.34 లక్షల కోట్ల రుణాలు

న్యూఢిల్లీ: చిన్న వ్యాపారులకు రుణ సదుపాయాలను మరింత విస్తరించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి ముద్ర యోజన (పీఎంఎంవై) కింద రుణాలు అందించే సూక్ష్మ యూనిట్ల క్రెడిట్ గ్యారంటీ ఫండ్ (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగించింది. 2031 మార్చి వరకు ఈ పథకాన్ని కొనసాగించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.5 వేల కోట్ల నిధిని కేటాయించింది. వచ్చే ఐదేళ్లలో ఈ పథకం ద్వారా రూ.12.6 లక్షల కోట్ల రుణాలు అందుబాటులోకి రానున్నాయి.

పూచీకత్తు లేకుండానే రుణాలు

సాధారణంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందాలంటే ఆస్తులు లేదా ఇతర పూచీకత్తులు సమర్పించాల్సి ఉంటుంది. చిన్న వ్యాపారులకు ఈ నిబంధన ఇబ్బందిగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు పీఎం ముద్ర యోజన కింద పూచీకత్తు అవసరం లేకుండా రుణాలు అందిస్తున్నారు. రుణాలు తిరిగి చెల్లించడంలో విఫలమైతే ఎదురయ్యే నష్టాల నుంచి రుణదాత సంస్థలకు రక్షణ కల్పించేందుకు క్రెడిట్ గ్యారంటీ ఫండ్ పనిచేస్తుంది. నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌సీజీటీసీ) ద్వారా ఈ హామీ కవరేజీ అందిస్తారు.

60 కోట్ల మందికి పైగా రుణాలు

2016లో పీఎం ముద్ర యోజన ప్రారంభమైనప్పటి నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా 60.36 కోట్లకు పైగా రుణాలు మంజూరయ్యాయి. వీటి విలువ రూ.43.34 లక్షల కోట్లు. చిన్న వ్యాపారాలు ప్రారంభించాలనుకునే యువతతోపాటు గతంలో అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి రుణాలు పొందలేకపోయిన వారికి ఈ పథకం అండగా నిలిచింది. కొత్త తరం పారిశ్రామికవేత్తల ఆవిర్భావానికి దోహదపడింది.

రూ.20 లక్షల వరకు హామీ

సూక్ష్మ యూనిట్ల క్రెడిట్ గ్యారంటీ ఫండ్ కింద పీఎం ముద్ర యోజన రుణాలకు రూ.20 లక్షల వరకు హామీ కవరేజీ ఉంటుంది. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలపై రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాలు, స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) రుణ పోర్ట్‌ఫోలియోలో రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలకూ ఈ పథకం వర్తిస్తుంది. 2026–27 నుంచి 2030–31 వరకు 16వ ఆర్థిక సంఘం కాలంలో మంజూరయ్యే అర్హత కలిగిన రుణాలకు ఈ పథకం వర్తించనుంది. కొత్త వ్యాపారాల స్థాపన, ఇప్పటికే ఉన్న చిన్న పరిశ్రమల విస్తరణకు ఈ నిర్ణయం తోడ్పడుతుందని కేంద్రం వెల్లడించింది.

సోనియాపై కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు

- కాంగ్రెస్ శ్రేణుల తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర వివాదానికి దారితీశాయి. ఇటీవల చర్చనీయాంశమైన ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ హనీట్రాప్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. గాంధీ కుటుంబంలో చోటు చేసుకున్న వరుస విషాదాల వెనుక సోనియా గాంధీ రాకతో ముడిపెట్టిన ఆరోపణలు చేశారు. ఈ మేరకు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పోస్టు పెట్టారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఎన్విడియా హనీట్రాప్ వ్యవహారంపై చర్చ జరుగుతోందని పేర్కొన్న కంగనా.. గతంలో గాంధీ కుటుంబంలోకి కూడా ఓ విదేశీ మహిళ ప్రవేశించారని, ఆ తర్వాతే ఇందిరా గాంధీ హత్యకు గురయ్యారని వ్యాఖ్యానించారు. అనంతరం సంజయ్ గాంధీ, రాజీవ్ గాంధీలు కూడా మరణించారని పేర్కొంటూ.. దేశంలో అత్యంత శక్తిమంతమైన కుటుంబంగా పేరొందిన గాంధీ కుటుంబంలో జరిగిన ఈ వరుస మరణాలపై ఎవరూ అనుమానం వ్యక్తం చేయలేదని ఆరోపించారు. అంతటితో ఆగకుండా.. ఉగ్రవాదుల విషయంలో మొసలి కన్నీరు కారుస్తూ, విదేశీ ఎజెండాతో సోనియా గాంధీ దశాబ్దాల పాటు ప్రభుత్వాన్ని నడిపించారని కంగనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే, ఈ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలను ఆమె వెల్లడించలేదు. చారిత్రక ఘటనలను వ్యక్తిగత ఆరోపణలతో ముడిపెట్టడంపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కంగనా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



రష్యా–ఉక్రెయిన్ ఖైదీల విడుదలకు అంగీకారం

- అబుధాబి చర్చల్లో కీలక పురోగతి

అబుధాబి: రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. యుద్ధ ఖైదీల మార్పిడికి ఇరు దేశాలు సూత్రప్రాయంగా అంగీకరించాయి. అమెరికా మధ్యవర్తిత్వంలో అబుధాబిలో రెండు రోజులపాటు జరిగిన త్రైపాక్షిక చర్చల్లో ఈ మేరకు పురోగతి సాధించినట్లు అమెరికా ప్రతినిధి బృందం వెల్లడించింది. అయితే విడుదల చేయనున్న ఖైదీల కచ్చితమైన సంఖ్యను మరికొన్ని గంటల్లో ఖరారు చేయనున్నట్లు తెలిపింది. ఇరుదేశాలు చెరో 1,000 నుంచి 1,500 మంది వరకు యుద్ధ ఖైదీలను విడుదల చేసే అవకాశంపై చర్చించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఖైదీల అప్పగింతకు సంబంధించిన చర్చలు సానుకూలంగా సాగాయని అమెరికా ప్రతినిధులు పేర్కొన్నారు. గతంలో విఫలమైన శాంతి ప్రయత్నాలను మళ్లీ ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా చర్చలు నిర్వహించినట్లు వివరించారు.

పుతిన్, జెలెన్‌స్కీతో భేటీలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరపున ఆయన అల్లుడు జారెడ్ కుష్నర్, దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ చర్చల్లో పాల్గొన్నారు. రష్యా బృందానికి వ్లాదిమిర్ మెడిన్‌స్కీ, ఉక్రెయిన్ బృందానికి రుస్తెం ఉమెరోవ్ నేతృత్వం వహించారు. రెండు రోజుల చర్చలు ముగిసిన నేపథ్యంలో నవంబర్ 12న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో, అనంతరం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో సమావేశమవుతామని అమెరికా ప్రతినిధి బృందం వెల్లడించింది. ఈ భేటీల్లో శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే అంశాలపై చర్చించే అవకాశం ఉంది.

93 రోజులు.. కోటి ప్రయాణాలు!

- నమో భారత్‌కు పెరుగుతున్న ఆదరణ • ఢిల్లీ–మీరట్ కారిడార్‌లో ఐదు కోట్ల ప్రయాణాల మైలురాయి
- ప్రారంభంలో కోటికి 574 రోజులు.. ఇప్పుడు కేవలం 93 రోజులే • రోజుకు సగటున లక్ష మందికి పైగా రాకపోకలు
- గంటకు 160 కి.మీ. వేగంతో రైళ్ల పరుగులు • ప్రయాణికుల సేవల్లో జాతీయ స్థాయి అవార్డు



న్యూఢిల్లీ: దేశ రాజధాని ప్రాంతంలో అత్యాధునిక రవాణా వ్యవస్థగా అందుబాటులోకి వచ్చిన నమో భారత్ రైళ్ల ప్రయాణికుల ఆదరణలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. ఢిల్లీ–ఘాజియాబాద్–మీరట్ కారిడార్‌లో ఇప్పటివరకు నమోదైన మొత్తం ప్రయాణాల సంఖ్య ఐదు కోట్ల మార్కును దాటింది. ముఖ్యంగా చివరి కోటి ప్రయాణాలు కేవలం 93 రోజుల్లోనే నమోదవడం ఈ రైళ్లకు పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది. 2023 అక్టోబర్‌లో సేవలు ప్రారంభమైన తర్వాత కోటి ప్రయాణాల మైలురాయిని ఇంత తక్కువ వ్యవధిలో చేరడం ఇదే తొలిసారి. ఈ వివరాలను నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌సీఆర్‌టీసీ) బుధవారం వెల్లడించింది. 2023 అక్టోబర్ 21న సాహిబాబాద్ నుంచి దుహాయ్ డిపో వరకు 17 కిలోమీటర్ల ప్రాధాన్య మార్గంలో నమో భారత్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. తొలి కోటి ప్రయాణాలు నమోదవడానికి 574 రోజులు పట్టగా, రెండో కోటి మైలురాయిని చేరడానికి 211 రోజులు, మూడో కోటికి 143 రోజులు, నాలుగో కోటికి 101 రోజులు పట్టింది. తాజాగా ఐదో కోటి ప్రయాణాలు కేవలం 93 రోజుల్లోనే నమోదయ్యాయి. గత ఏడాది కాలంలోనే మూడు కోట్లకు పైగా ప్రయాణాలు నమోదయ్యాయి. 2025 డిసెంబర్‌లో రెండు కోట్లుగా ఉన్న మొత్తం ప్రయాణాల సంఖ్య 2026 నవంబర్ నాటికి ఐదు కోట్లకు చేరింది.

రోజుకు లక్ష మందికి పైగా ప్రయాణం

నమో భారత్ కారిడార్‌లో రోజువారీ ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఆగస్టులో 35.25 లక్షల ప్రయాణాలు నమోదయ్యాయి. రోజుకు సగటున 1.13 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఆగస్టు 28న అత్యధికంగా ఒక్కరోజే 1,68,666 ప్రయాణాలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లో 32.41 లక్షలు, అక్టోబర్‌లో 33.49 లక్షల ప్రయాణాలు నమోదయ్యాయి. ఈ రెండు నెలల్లోనూ రోజువారీ సగటు ప్రయాణాలు సుమారు 1.08 లక్షలుగా ఉన్నాయని ఎన్‌సీఆర్‌టీసీ వెల్లడించింది. ఢిల్లీ, ఘాజియాబాద్, మీరట్ నగరాలను అనుసంధానిస్తున్న ఈ కారిడార్‌లో నమో భారత్ రైళ్లు గంటకు గరిష్ఠంగా 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాయి. 99 శాతానికి పైగా సమయ పాలనతో సేవలందిస్తున్నాయి. ఏసీ కోచ్‌లు, వేగవంతమైన రవాణా, నమ్మకమైన సేవలు, ఇతర ప్రజా రవాణా వ్యవస్థలతో అనుసంధానం ప్రయాణికుల ఆదరణ పెరగడానికి ప్రధాన కారణాలుగా సంస్థ పేర్కొంది. ఢిల్లీ మెట్రో, భారతీయ రైల్వేలు, అంతర్రాష్ట్ర బస్ టెర్మినళ్లు, నగర బస్సులతో అనుసంధాన సదుపాయాలు కల్పించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న పూర్తి నమో భారత్ కారిడార్‌తోపాటు మీరట్ మెట్రో సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

ప్రయాణికుల సేవలకు అవార్డు

నమో భారత్ కారిడార్ అందిస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2026 అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్‌పోలో 'ఉత్తమ ప్రయాణికుల సేవలు, సంతృప్తి' విభాగంలో ఢిల్లీ–మీరట్ నమో భారత్ కారిడార్‌కు అవార్డు దక్కింది. భువనేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రయాణికుల నుంచి పెరుగుతున్న ఆదరణతో పాటు జాతీయ స్థాయి అవార్డు కూడా ఈ రవాణా వ్యవస్థకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.



ఐపీఎల్‌లో కొత్త జట్లకు చోటు లేదు

- ఇలాంటి ప్రతిపాదనపై చర్చే జరగలేదు
- 2027 సీజన్‌పైనే దృష్టి.. మార్చిలో ప్రారంభం
- ఆటగాళ్ల వేలం పర్స్ పెంపుపై నిర్ణయం తీసుకోలేదు
- బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో జట్ల సంఖ్యను 10 నుంచి 12కు పెంచే ఆలోచన ప్రస్తుతానికి లేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. 2028 సీజన్ నుంచి మరో రెండు జట్లను చేర్చాలనే ప్రతిపాదనపై బోర్డులో అధికారికంగా కానీ, అనధికారికంగా కానీ ఎలాంటి చర్చ జరగలేదని తెలిపారు. ప్రస్తుతం అలాంటి విస్తరణకు అవకాశమే లేదని పేర్కొన్నారు. 2027లో జరిగే ఐపీఎల్ 20వ సీజన్ నిర్వహణపైనే బీసీసీఐ దృష్టి సారించిందని సైకియా చెప్పారు. అది ప్రత్యేకమైన సీజన్ కానున్నందున ఏర్పాట్లపై కసరత్తు చేస్తున్నామని తెలిపారు. 2027కు మించి జరిగే మార్పుల గురించి ప్రస్తుతం ఆలోచించడం లేదన్నారు. ఐపీఎల్ జట్ల విస్తరణపై మీడియాలో వస్తున్న వార్తలన్నీ ఊహాగానాలేనని, వాటికి ఎలాంటి ప్రామాణికత లేదని కొట్టిపారేశారు. 2027 మెగా వేలానికి ముందు ఆటగాళ్ల కొనుగోలు కోసం ఒక్కో ఫ్రాంచైజీకి కేటాయించే మొత్తాన్ని రూ.125 కోట్ల నుంచి రూ.150 కోట్లకు పెంచుతారన్న ప్రచారంపైనా సైకియా స్పందించారు. పర్స్ పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. ఈ ఏడాది డిసెంబర్ 16న జరిగేది మెగా వేలం కాదని, ప్రస్తుత ఆటగాళ్ల వేలం ప్రక్రియలో భాగంగానే ఉంటుందని వివరించారు. వచ్చే ఏడాది మెగా వేలం ఉంటుందని, ఆ తర్వాతే నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

మార్చిలోనే ఐపీఎల్ ప్రారంభం

ఐపీఎల్‌ను ఏప్రిల్–మే నెలలకు బదులుగా జనవరిలో నిర్వహించాలంటూ కోల్‌కతా నైట్‌రైడర్స్ సహా యజమాని, సినీ నటి జూహీ చావ్లా ఇటీవల 'ఎక్స్' వేదికగా చేసిన సూచనపై స్పందించేందుకు సైకియా నిరాకరించారు. 2027 ఐపీఎల్‌ను మార్చిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయడంపైనే ప్రస్తుతం దృష్టి ఉందని స్పష్టం చేశారు.

కొత్త ఆటగాళ్లదే హవా!

- నేషన్స్ లీగ్‌లో ఎంబాపె, యమాల్, హ్యారీ కేన్‌పై అందరి దృష్టి
- రొనాల్డో లేకుండా తొలిసారి బరిలోకి పోర్చుగల్
- రికార్డుకు చేరువలో ఇంగ్లండ్ కెప్టెన్ కేన్
- క్వార్టర్ ఫైనల్ బెర్తుల కోసం అగ్రశ్రేణి జట్ల పోరు

మాంచెస్టర్: అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో క్రిస్టియానో రొనాల్డో, లియోనెల్ మెస్సీ ఆధిపత్య శకం ముగిసింది. ఈ ఏడాది ప్రపంచకప్ తర్వాత అర్జెంటీనా జట్టుకు మెస్సీ దూరం కాగా.. గత వారం పోర్చుగల్ జాతీయ జట్టుకు రొనాల్డో వీడ్కోలు పలికాడు. దీంతో ప్రపంచ ఫుట్‌బాల్‌లో తదుపరి తరం ఆటగాళ్లపై అభిమానుల దృష్టి పడింది. కైలియన్ ఎంబాపె, లమైన్ యమాల్, ఇటీవల బాలన్ డి ఓర్ అందుకున్న హ్యారీ కేన్ వంటి స్టార్లు తమ జట్లను ముందుండి నడిపించేందుకు సిద్ధమయ్యారు. వచ్చే వారం జరిగే నేషన్స్ లీగ్ మ్యాచ్‌లు వీరి ప్రతిభకు వేదిక కానున్నాయి.

రొనాల్డో లేని పోర్చుగల్ ఎలా?

గతేడాది పోర్చుగల్‌కు నేషన్స్ లీగ్ టైటిల్ అందించడం రొనాల్డో అంతర్జాతీయ కెరీర్‌లో చివరి ప్రధాన విజయంగా నిలిచింది. జట్టు కోచ్ జార్జ్ జీసస్‌తో విభేదాల నేపథ్యంలో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రొనాల్డో వీడ్కోలు పలికాడు. పురుషుల అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ (146), అత్యధిక మ్యాచ్‌లు (234) ఆడిన ఆటగాడిగా రిటైరయ్యాడు. ప్రపంచకప్ సాధించలేకపోయినా.. యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌తో పాటు రెండు నేషన్స్ లీగ్ టైటిళ్లను గెలుచుకున్నాడు. ఇప్పుడు రొనాల్డో లేకుండా పోర్చుగల్ తొలిసారి బరిలోకి దిగనుంది. బ్రూనో ఫెర్నాండెజ్, జావో నెవెస్, విటిన్హో వంటి ఆటగాళ్లు జట్టుకు నాయకత్వం వహిస్తున్నారు. రొనాల్డో ప్రభావం కారణంగా గతంలో పరిమిత అవకాశాలే దక్కిన గొన్సాలో రామోస్‌కు ఇప్పుడు తన సత్తా చాటే అవకాశం లభించనుంది. ఇప్పటికే వరుస విజయాలతో క్వార్టర్ ఫైనల్ బెర్తు ఖరారు చేసుకున్న పోర్చుగల్.. శనివారం డెన్మార్క్‌తో, మంగళవారం వేల్స్‌తో తలపడనుంది.

స్పెయిన్ మరో టైటిల్‌పై గురి

2024 యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్ నేషన్స్ లీగ్ టైటిల్‌పైనా కన్నేసింది. గ్రూప్–ఏ3లో వరుస విజయాలతో



క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. గురువారం చెక్ రిపబ్లిక్‌తో జరిగే మ్యాచ్‌లో గెలిస్తే గ్రూప్ అగ్రస్థానాన్ని దక్కించుకుంటుంది. అదేరోజు జరిగే ఇంగ్లండ్–క్రొయేషియా మ్యాచ్ ఫలితం కూడా స్పెయిన్ స్థానాన్ని ప్రభావితం చేయనుంది. ఆదివారం చివరి గ్రూప్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో స్పెయిన్ తలపడుతుంది. క్రొయేషియాతో మ్యాచ్‌లో ఓటమి తప్పించుకుంటే ఇంగ్లండ్ కూడా క్వార్టర్ ఫైనల్‌కు చేరుతుంది.

కేన్ ఖాతాలో మరో రికార్డు?

ఇటీవల బాలన్ డి ఓర్ అందుకున్న ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్ మరో ఘనతకు చేరువలో ఉన్నాడు. క్రొయేషియాతో మ్యాచ్‌లో ఆడితే ఇంగ్లండ్ తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ప్రస్తుతం 125 మ్యాచ్‌లు ఆడిన కేన్.. మరో మ్యాచ్‌తో 126 మ్యాచ్‌ల మైలురాయిని చేరుకుంటాడు. ఇప్పటికే 91 గోల్స్‌తో ఇంగ్లండ్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ప్రపంచకప్‌లో 14, యూరోపియన్ ఛాంపియన్‌షిప్‌లో ఏడు గోల్స్ సాధించాడు. ప్రధాన అంతర్జాతీయ టోర్నీల్లో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాళ్ల జాబితాలో మెస్సీతో కలిసి మూడో స్థానంలో ఉన్నాడు. ఈ జాబితాలో రొనాల్డో 25, ఎంబాపె 23 గోల్స్‌తో తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

జర్మనీకి కఠిన పరీక్ష


జర్మనీ ఫుట్‌బాల్‌కు పూర్వవైభవం తీసుకొచ్చే లక్ష్యంతో కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన జుర్గెన్ క్లోప్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఆయన ఆధ్వర్యంలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో జర్మనీ ఒక్కదాంట్లోనే విజయం సాధించింది. గ్రీస్ చేతిలో ఓటమి జట్టుకు ఎదురు దెబ్బగా మారింది. గ్రూప్–ఏ2లో నెదర్లాండ్స్, గ్రీస్ జట్లు జర్మనీ కంటే మూడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నాయి. దీంతో క్వార్టర్ ఫైనల్ బెర్తు కోసం మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో జర్మనీ తప్పనిసరిగా మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. శుక్రవారం సెర్బియాతో, సోమవారం నెదర్లాండ్స్‌తో తలపడనుంది. తాజా జట్టు ఎంపికలో బార్సిలోనా ఆటగాడు కరీమ్ అదెయెమీ, జువెంటస్ ఫార్వర్డ్ నిక్ వోల్టెమాడేలకు చోటు దక్కలేదు. 17 ఏళ్ల వేలీ మొహ్యాకు తొలిసారి జాతీయ జట్టులో అవకాశం కల్పించారు.

జిదానే ఆధ్వర్యంలో ఫ్రాన్స్ జోరు

ఫ్రాన్స్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన దిగ్గజ ఆటగాడు జినెడిన్ జిదానే విజయవంతమైన ఆరంభం చేశాడు. ప్రపంచకప్ తర్వాత దిదియర్ దెషాంప్స్ స్థానంలో బాధ్యతలు స్వీకరించిన ఆయన.. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో జట్టుకు మూడు విజయాలు, ఒక డ్రా అందించాడు. దీంతో గ్రూప్–ఏ1లో ఫ్రాన్స్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. గురువారం మిలాన్‌లో ఇటలీతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ఓటమి తప్పించుకుంటే గ్రూప్ విజేతగా నిలుస్తుంది. ఇటలీ ఏడు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. రాబర్టో మాన్సిని రెండోసారి ఆ జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. మరోవైపు కొత్త కోచ్ మార్క్ వాన్ బొమ్మెల్ ఆధ్వర్యంలోని బెల్జియం ఆరు పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. గురువారం టర్కీతో, ఆదివారం ఇటలీతో ఆడే మ్యాచ్‌లు ఆ జట్టు క్వార్టర్ ఫైనల్ అవకాశాలను నిర్ణయించనున్నాయి.

ఐపీఎల్‌లో ట్రేడింగ్ సంచలనం

- పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ పాండ్య.. ముంబై ఇండియన్స్‌కు అర్ష్‌దీప్ సింగ్
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు రిషభ్ పంత్.. లక్నోకు కుల్దీప్ యాదవ్
- రూ.13 కోట్ల నుంచి రూ.6 కోట్లకు లియామ్ లివింగ్‌స్టోన్
- డిసెంబర్ 16న గోవాలో మినీ వేలం.. నవంబర్ 16 తర్వాత రిటెన్షన్ జాబితా



న్యూఢిల్లీ: ఐపీఎల్–2027 సీజన్‌కు ముందు ఆటగాళ్ల బదిలీల ప్రక్రియ ఆసక్తికరంగా సాగుతోంది. డిసెంబర్ 16న గోవాలో జరగనున్న మినీ వేలానికి వారం రోజుల ముందు వరకు ట్రేడింగ్ విండో అందుబాటులో ఉండనుంది. నవంబర్ 16 తర్వాత ఫ్రాంచైజీలు తమ వద్ద కొనసాగించుకునే ఆటగాళ్ల జాబితాను ప్రకటించనున్నాయి. ఇప్పటివరకు జరిగిన ప్రధాన ఆటగాళ్ల బదిలీలు ఇవీ..

హార్దిక్–అర్ష్‌దీప్ మార్పిడి

ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన అత్యంత కీలక ట్రేడింగ్ ఇదే. ముంబై ఇండియన్స్ నుంచి హార్దిక్ పాండ్య పంజాబ్ కింగ్స్‌కు మారగా, పంజాబ్ జట్టు నుంచి అర్ష్‌దీప్ సింగ్ ముంబైకి వెళ్లాడు. ఇద్దరి ట్రేడింగ్ ధర రూ.18 కోట్లుగా ఉంది. ముంబైలో హార్దిక్ గత ధర రూ.16.35 కోట్లు కాగా, తాజా ఒప్పందంలో రూ.1.65 కోట్లు పెరిగింది. అర్ష్‌దీప్ ధరలో మార్పు లేదు.

ఢిల్లీకి పంత్.. లక్నోకు కుల్దీప్

లక్నో సూపర్ జెయింట్స్ నుంచి రిషభ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారాడు. అతడి ట్రేడింగ్ ధర రూ.15 కోట్లు. గత వేలంలో లక్నో అతడిని రికార్డు స్థాయిలో రూ.27 కోట్లకు కొనుగోలు చేసింది. రెండు సీజన్లలో ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో ఇప్పుడు రూ.12 కోట్ల తక్కువ ధరకు ఢిల్లీకి చేరాడు. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి కుల్దీప్ యాదవ్ లక్నో జట్టులోకి వెళ్లాడు. అతడి ధర రూ.13.25 కోట్ల వద్ద యథాతథంగా ఉంది.

నటరాజన్‌కు తగ్గిన ధర

ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి టీ.నటరాజన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)కు మారాడు. అతడి తాజా ధర రూ.5 కోట్లు. గత వేలంలో ఢిల్లీ అతడిని రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. గాయాల కారణంగా ప్రదర్శన తగ్గడంతో ధరలో గణనీయమైన కోత పడింది. మరోవైపు ఎస్‌ఆర్‌హెచ్ ఆటగాడు జీషన్ అన్సారీ ఢిల్లీకి మారాడు. అతడి ధర రూ.40 లక్షలుగా కొనసాగనుంది. కుల్దీప్ లక్నోకు వెళ్లడంతో అతడి స్థానంలో మరో మణికట్టు స్పిన్నర్‌ను తీసుకోవాలనే ఉద్దేశంతో ఢిల్లీ ఈ నిర్ణయం తీసుకుంది.

చెన్నై–హైదరాబాద్ మధ్య డబుల్ ట్రేడ్

చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన ఆటగాళ్ల మార్పిడి కూడా ఆసక్తి రేపుతోంది. ఎస్‌ఆర్‌హెచ్ నుంచి లియామ్ లివింగ్‌స్టోన్ రూ.6 కోట్లకు, జాక్ ఎడ్వర్డ్స్ రూ.3 కోట్లకు చెన్నై జట్టులోకి వెళ్లారు. ప్రతిగా చెన్నై నుంచి ఖలీల్ అహ్మద్ రూ.4.8 కోట్లకు, నాథన్ ఎల్లిస్ రూ.2 కోట్లకు హైదరాబాద్ జట్టులో చేరారు. ఈ నలుగురి ధరల్లో లివింగ్‌స్టోన్ మినహా మిగతా ముగ్గురి ధరల్లో మార్పు లేదు. గత వేలంలో రూ.13 కోట్లకు లివింగ్‌స్టోన్‌ను కొనుగోలు చేసిన హైదరాబాద్ జట్టులో అతడికి తుది జట్టులో చోటు దక్కలేదు. దీంతో రూ.7 కోట్లు తక్కువ ధరకు చెన్నైకి బదిలీ అయ్యాడు. చెపాక్ మైదానంలోని నెమ్మదైన పిచ్‌లపై అతడి ప్రదర్శన ఎలా ఉంటుందనేది ఆసక్తికరం. జాక్ ఎడ్వర్డ్స్ ఐపీఎల్‌లో ఇంకా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి ఉంది. హైదరాబాద్ తరఫున ఏడు మ్యాచ్‌లే ఆడిన ఖలీల్ అహ్మద్‌కు కొత్త జట్టులో ఎలాంటి అవకాశాలు లభిస్తాయన్నది చూడాలి. మరోవైపు ప్యాట్ కమిన్స్‌కు ప్రత్యామ్నాయంగా నాథన్ ఎల్లిస్‌ను సిద్ధంగా ఉంచుకో వాలనే ఉద్దేశంతో ఎస్‌ఆర్‌హెచ్ అతడిని తీసుకున్నట్లు తెలుస్తోంది. 2027 ఐపీఎల్ సీజన్ బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ, యాషెస్ సిరీస్‌ల మధ్య జరగనుండడంతో కమిన్స్ పాల్గొనడంపై సందేహాలు నెలకొన్నాయి.

ఒత్తిళ్లతోనే పోటీ నుంచి తప్పుకున్నా

- ఐఓఏ ఎన్నికలపై అశ్విని నాచప్ప సంచలన ఆరోపణలు
- అక్రమాలపై పీటీ ఉష, సతీశ్ శివలింగం ఫిర్యాదులు

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) స్పోర్ట్స్‌పర్సన్స్ ఆఫ్ మెరిట్ (ఎస్ఓఎం) ఎన్నికల ప్రక్రియపై వివాదం ముదురుతోంది. ఎన్నికల బరి నుంచి తాను బాహ్య ఒత్తిళ్ల కారణంగానే వైదొలగాల్సి వచ్చిందని మాజీ అథ్లెట్ అశ్విని నాచప్ప ఆరోపించారు. అభ్యర్థుల ఉపసంహరణలు స్వచ్ఛందంగా జరగలేదని, ఈ పరిణామాలు ఎన్నికల పారదర్శకతపై అనుమానాలు కలిగిస్తున్నాయని వ్యాఖ్యానించారు. అయితే తనపై ఒత్తిడి తెచ్చినవారి వివరాలను వెల్లడించలేదు. మహిళా ఎస్ఓఎం స్థానాల కోసం తొలుత 11మంది నామినేషన్లు దాఖలు చేయగా.. అశ్వినితో సహా ఐదుగురు నవంబర్ 7న పోటీ నుంచి తప్పుకున్నారు. సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో అంజు బాబీ జార్జ్ 53, రాణి రాంపాల్ 50, డోలా బెనర్జీ 45, సైనా నెహ్వాల్ 43 ఓట్లు సాధించి ఎన్నికయ్యారు. ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష ఐదో స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో నలుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఒలింపిక్ విలువలు కనుమరుగు

క్రీడారంగంలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని అశ్విని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ న్యాయబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందనే నమ్మకం ఉంటే పోటీలో కొనసాగేదాన్నని పేర్కొన్నారు. అయితే ఒలింపిక్ విలువలు, నైతికతకు చోటు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై కర్ణాటకలో తాను నిర్వహిస్తున్న విద్యాసంస్థ కార్యకలాపాలపై దృష్టి సారిస్తానని చెప్పారు. అక్కడ 12వ తరగతి వరకు సుమారు 900 మంది విద్యార్థులు చదువుతున్నట్లు వెల్లడించారు.

ఓట్ల కోసం వాట్సాప్ ప్రచారంపై ఫిర్యాదు

ఎన్నికల సందర్భంగా డోలా బెనర్జీ వాట్సాప్ ద్వారా ఓట్లు కోరుతూ మోడల్ కోడ్‌ను ఉల్లంఘించారని పీటీ ఉష ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. మరోవైపు, ఓ అభ్యర్థికి అనుకూలంగా ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఐఓఏ వనరులను వినియోగిస్తున్నారని వెయిటలిఫ్టర్ సతీశ్ శివలింగం కూడా ఫిర్యాదు చేశారు. ఎన్నికల ఫలితాలు న్యాయబద్ధంగా లేవని పీటీ ఉష వ్యాఖ్యానించడాన్ని ప్రస్తావించిన అశ్విని.. ఆమె వద్ద అందుకు సంబంధించిన ఆధారాలు ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఫిర్యాదులపై ఎన్నికల అధికారి తీసుకునే చర్యలపై ఆసక్తి నెలకొంది.

టాప్ 10లో పంత్, గిల్

- బ్యాటర్ల జాబితాలో వరుసగా 8, 10 స్థానాల్లో భారత ఆటగాళ్లు
- బౌలర్లలో బుమ్రాకు ఐదో స్థానం
- ఆల్‌రౌండర్ల జాబితాలో రెండో ర్యాంకులో జడేజా
- టెస్టు ర్యాంకింగ్స్ విడుదల చేసిన ఐసీసీ

దుబాయ్: ఐసీసీ తాజా టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాప్–10లో చోటు నిలబెట్టుకున్నారు. అయితే ఇద్దరూ ఒక్కో స్థానం దిగజారి వరుసగా 8, 10 ర్యాంకుల్లో నిలిచారు. పంత్ 713 రేటింగ్ పాయింట్లతో, గిల్ 697 పాయింట్లతో కొనసాగుతున్నారు. మరో భారత బ్యాటర్ యశస్వి జైస్వాల్ 13వ స్థానంలో ఉన్నాడు. అఫ్గానిస్థాన్ కెప్టెన్ రహ్మత్ షా టెస్టు ర్యాంకింగ్స్‌లో చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టెస్టు ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో ఏ విభాగంలోనైనా టాప్–10లోకి ప్రవేశించిన తొలి అఫ్గాన్ ఆటగాడిగా నిలిచాడు. జింబాబ్వేతో షార్జాలో జరిగిన తొలి టెస్టులో 173 పరుగులు చేసిన రహ్మత్.. ఆరు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. ఇది అతడి కెరీర్‌లో ఐదో టెస్టు శతకం కాగా.. ఈ ఏడాది రెండోది. టెస్టు బ్యాటర్ల జాబితాలో ఇంగ్లండ్ ఆటగాళ్లు హ్యారీ బ్రూక్, జో రూట్ తొలి రెండు స్థానాల్లో ఉండగా.. ఆస్ట్రేలియా హెడ్, దక్షిణాఫ్రికా బవుమా, స్టీవ్ స్మిత్ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.





స్టార్క్ అగ్రస్థానం

టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత పేస్ దిగ్గజం జస్‌ప్రీత్ బుమ్రా ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ అగ్రస్థానంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికా మార్కో యాన్సెన్, న్యూజిలాండ్ మాట్ హెన్రీ, ఇంగ్లండ్ ఒలీ రాబిన్సన్ తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నారు. టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా రెండో ర్యాంకును నిలబెట్టుకోగా.. వాషింగ్టన్ సుందర్ ఏడో స్థానంలో ఉన్నాడు.

వన్డేల్లోనూ భారత బౌలర్ల జోరు

న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల ప్రదర్శనతో భారత బౌలర్లు ర్యాంకింగ్స్‌లో మెరుగుపడ్డారు. రెండో వన్డేలో 2/28తో రాణించిన అక్షర్ పటేల్ 23 స్థానాలు ఎగబాకి 21వ ర్యాంకుకు చేరుకున్నాడు. తొలి మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీసిన అర్ష్‌దీప్ సింగ్ 11 స్థానాలు మెరుగుపరుచుకుని 31వ ర్యాంకులో నిలిచాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఏడు వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన గుర్నూర్ బ్రార్.. టాప్–100 వెలుపలి స్థానం నుంచి ఏకంగా 48వ ర్యాంకుకు చేరుకున్నాడు.

డబ్ల్యూటీసీ మ్యాచ్‌లపై ఐసీసీ కసరత్తు

- 2027–29, 2029–31 మ్యాచ్‌ల ప్రతిపాదనల రూపకల్పన
- 2035 వరకు టోర్నీల షెడ్యూళ్లకు ఆమోదం
- ఫ్రాంచైజీ లీగ్‌లకు కొత్త నిబంధనలపైనా చర్చ

బాలి: ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) తదుపరి రెండు సైకిళ్లలో జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కసరత్తు ప్రారంభించనుంది. 2027–29, 2029–31 సైకిళ్లలో ఏయే జట్లు పరస్పరం తలపడాలన్న అంశంపై ప్రతిపాదనలు రూపొందించనుంది. ఇండోనేషియాలోని బాలిలో బుధవారం ప్రారంభమైన ఐసీసీ బోర్డు సమావేశాల్లో దీనిపై చర్చించనున్నారు. అలాగే 2028 నుంచి 2035 వరకు జరిగే పురుషుల ప్రధాన ఐసీసీ టోర్నీల షెడ్యూళ్లకు సంబంధించిన తేదీలను ఆమోదం కోసం బోర్డు ముందుంచనున్నారు.

నాలుగు రోజుల పాటు కీలక భేటీలు

నవంబర్ 15 వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో ఐసీసీకి చెందిన ఎనిమిది కమిటీలు పాల్గొనున్నాయి. 2026లో చివరిసారిగా నిర్వహిస్తున్న ఈ సమావేశాలకు ఐసీసీ బోర్డు, వివిధ కమిటీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ ఏడాది జులైలో జరిగిన వార్షిక సమావేశంలో ఏర్పాటు చేసిన ఫ్రాంచైజీ లీగ్‌ల సమీక్ష బృందం, ఐసీసీ పాలనా వ్యవస్థ సమీక్ష కమిటీ తమ తొలి నివేదికలను సమర్పించనున్నాయి.



ఫ్రాంచైజీ లీగ్‌లకు కొత్త మార్గదర్శకాలు?

ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్ లీగ్‌ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటి నిర్వహణకు అనుమతుల విధానాన్ని మరింత పటిష్ఠం చేయడంపై ఐసీసీ దృష్టి సారించింది. క్రికెట్ వ్యవస్థ సమతుల్యతను కాపాడటంతో పాటు, లీగ్‌ల విస్తరణ వల్ల ఎదురయ్యే సవాళ్లను అధిగమించే మార్గాలను సమీక్ష బృందం పరిశీలిస్తోంది. ఐసీసీ పాలనా వ్యవస్థపై సమగ్ర సమీక్ష చేపట్టిన కమిటీ కూడా తన ప్రాథమిక సిఫారసులను సమావేశంలో అందించనుంది. అఫ్గాన్ శరణార్థి మహిళా క్రికెటర్ల అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించి తదుపరి కార్యాచరణ ప్రణాళికను ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బోర్డు ముందుంచనుంది.

క్రికెట్‌లో ఇండోనేషియా దూకుడు

అంతర్జాతీయ క్రికెట్‌లో ఇండోనేషియా ప్రగతి సాధిస్తున్న తరుణంలో ఐసీసీ సమావేశాలకు ఆ దేశం ఆతిథ్యమిస్తోంది. 2025లో అత్యధిక టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన జట్టుగా ఇండోనేషియా పురుషుల జట్టు నిలిచింది. ఆ దేశ సీనియర్ మహిళల జట్టు ఈ ఏడాది తొలిసారిగా ఆసియా కప్‌లో పాల్గొంది. అండర్–19 మహిళల జట్టు కూడా తొలిసారి అండర్–19 ఆసియా కప్‌కు అర్హత సాధించింది. క్రికెట్ మైదానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇండోనేషియా పెట్టుబడులు పెంచుతోంది. ఇందులో భాగంగా నిర్మిస్తున్న బాలి ఇంటర్నేషనల్ ఓవల్ మైదానం 2027లో జరిగే ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ తూర్పు ఆసియా–పసిఫిక్ క్వాలిఫయర్ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుంది.

డబ్ల్యూటీఏ ఫైనల్స్ సెమీస్‌కు నోస్కోవా

- గాఫ్‌పై వరుస సెట్లలో ఘన విజయం

ఇండియన్ వెల్స్ (అమెరికా): డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీలో చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్ లిండా నోస్కోవా సెమీఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. మంగళవారం జరిగిన గ్రూప్–1 మ్యాచ్‌లో అమెరికా క్రీడాకారిణి కోకో గాఫ్‌ను 6–3, 6–3తో వరుస సెట్లలో ఓడించింది. కేవలం గంటా 15 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తు చేసిన నోస్కోవా.. ఈ ఏడాది టోర్నీలో సెమీస్‌కు చేరిన తొలి ప్లేయర్‌గా నిలిచింది. గ్రూప్–1 నుంచి మిగిలిన బెర్తు కోసం గాఫ్, మరో అమెరికా స్టార్ జెస్సికా పెగులా పోటీపడుతున్నారు. మరో గ్రూప్ మ్యాచ్‌లో జెస్సికా పెగులా ఉక్రెయిన్ క్రీడాకారిణి మార్తా కోస్టూక్‌ను ఓడించి సెమీస్ అవకాశాలను నిలబెట్టుకుంది. 2023 ఫైనల్స్‌లో రన్నరప్‌గా నిలిచిన పెగులా.. ఈసారి చివరి నాలుగులో చోటు దక్కించుకోవాలని పట్టుదలగా ఉంది.



నేడు ఇడుపుకాయితం టీజర్

- ప్రత్యేక పోస్టర్‌ను పంచుకున్న చిత్రబృందం

విభిన్నమైన కథలు, విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో ప్రియదర్శి మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ఇడుపుకాయితం'పై ఇప్పటికే అంచనాలు ఏర్పడగా.. తాజాగా టీజర్ విడుదల తేదీని చిత్రబృందం ప్రకటించింది. నవంబర్ 12న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు వెల్లడిస్తూ ఓ ప్రత్యేక పోస్టర్‌ను పంచుకుంది. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ కథానాయికగా నటిస్తున్నారు. ప్రియదర్శి తన సహజమైన నటనతో కామెడీతో పాటు భావోద్వేగాలను కూడా పండించగల నటుడిగా గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో 'ఇడుపుకాయితం'లో ఆయన పాత్ర ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ప్రియదర్శి, నాగదుర్గ మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్లను ముమ్మరం చేస్తోంది.



మెగాస్టార్ చిరంజీవి, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఒకే వేదికపై నందడి చేయనున్నారా? ప్రస్తుతం టాలీవుడ్‌లో ఈ ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ప్రముఖ ఓటీటీ నంస్థ నెట్‌ఫ్లిక్స్ కోసం చిరంజీవి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'మెగావర్స్' టాక్ షోలో ప్రభాస్ ప్రత్యేక అతిథిగా పాల్గొననున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఎపిసోడ్ షూటింగ్‌ను నవంబర్ 20, 2026న నిర్వహించే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి.

ఒకే వేదికపై మెగాస్టార్.. రెబల్ స్టార్

- 'మెగావర్స్'లో నందడి చేయనున్న ప్రభాస్
- ఈనెల 20న ప్రత్యేక ఎపిసోడ్ షూటింగ్?

అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. చిరంజీవి తొలిసారి ఓటీటీ టాక్ షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తుండటంతో 'మెగావర్స్'పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఈ షో షూటింగ్ ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికే అక్కినేని నాగార్జున, ఆయన కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు తమ ఎపిసోడ్ల చిత్రీకరణలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. చిరంజీవి, ప్రభాస్ ఒకే వేదికపై కలిస్తే వారి మధ్య సంభాషణలు, సరదా కబుర్లు అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

అలియాస్ రుక్మిణి సెకండ్ సింగిల్

యంగ్ హీరో నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి' నుంచి మరో మ్యూజికల్ అప్‌డేట్ వచ్చింది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'రుక్కు రుక్కు రుక్మిణి' ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచగా.. తాజాగా రెండో పాట 'పిచ్చి ప్రేమలో'ను నవంబర్ 13న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ ఊపందుకోనున్నాయి. నేచురల్ స్టార్ నాని సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో నితిన్ కృష్ణ పాత్రలో, ఆఫియా సయ్యద్ రుక్మిణి పాత్రలో కనిపించనున్నారు. వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథే చిత్రానికి ప్రధాన ఆకర్షణ కానుంది. విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. 'పిచ్చి ప్రేమలో' పాట ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



లాభాల దిశగా ఎయిరిండియా

- పునరుద్ధరణలో స్పష్టమైన పురోగతి
- పూర్తిస్థాయి మార్పులకు మరింత సమయం
- సింగపూర్ ఎయిర్‌లైన్స్



న్యూఢిల్లీ: నష్టాల నుంచి లాభాల బాట పట్టే దిశగా ఎయిరిండియా అడుగులు వేస్తోందని ఆ సంస్థలో కీలక వాటాదారుగా ఉన్న సింగపూర్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ (ఎస్ఐఏ) వెల్లడించింది. ఎయిరిండియా పునరుద్ధరణ, పరివర్తన ప్రక్రియలో గణనీయమైన పురోగతి కనిపిస్తున్నప్పటికీ పూర్తి స్థాయి మార్పులకు మరికొంత సమయం పడుతుందని తెలిపింది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ మధ్య సమన్వయం పెంచడం, నిర్వహణ వ్యయాలు తగ్గించడం, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంపై టాటా సన్స్‌తో కలిసి పనిచేస్తున్నట్లు పేర్కొంది. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఎయిరిండియా నుంచి వచ్చే నష్టాల్లో తమ వాటా 110 మిలియన్ సింగపూర్ డాలర్లు తగ్గడం ఈ పరిణామానికి నిదర్శనమని వివరించింది.

సింగపూర్ ఎయిర్‌లైన్స్ లాభాల్లో హెచ్చుతగ్గులు

సెప్టెంబర్ త్రైమాసికంలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ నికర లాభం 210 మిలియన్ సింగపూర్ డాలర్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 158 మిలియన్ డాలర్లు పెరిగింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల లాభం మాత్రం గత ఏడాదితో పోలిస్తే 44 శాతం తగ్గి 134 మిలియన్ డాలర్లుగా నమోదైంది. నిర్వహణ లాభం తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని సంస్థ తెలిపింది. ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉంది. భారత విమానయాన మార్కెట్‌లో తమ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా కీలకమని సంస్థ పేర్కొంది. ఎయిరిండియా వ్యాపారాన్ని లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు టాటా సన్స్‌తో కలిసి వ్యయ నియంత్రణ, వ్యాపార సమన్వయం, వాణిజ్య వ్యూహాల మెరుగుదలపై దృష్టి సారించినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా ఎయిరిండియా అక్టోబర్‌లో వివిధ విభాగాలతో ప్రత్యేక వ్యయ నియంత్రణ బృందాన్ని ఏర్పాటు చేసింది. పొదుపు, జవాబుదారీతనానికి ప్రాధాన్యమివ్వాలని కొత్త సీఈవో, ఎండీ టెవోల్డే గెబ్రెమారియం ఉద్యోగులకు సూచించారు. మధ్యప్రాచ్య సంఘర్షణలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు విమానయాన రంగంపై ఒత్తిడి పెంచుతున్నాయని సింగపూర్ ఎయిర్‌లైన్స్ తెలిపింది. విమాన ఇంధన ధరలు సంఘర్షణకు ముందున్న స్థాయితో పోలిస్తే ఇంకా అధికంగానే ఉన్నాయని పేర్కొంది. టికెట్ ధరలు, కార్గో ఛార్జీలు పెంచినా ఇంధన వ్యయాల భారాన్ని పూర్తిగా భర్తీ చేయలేకపోతున్నట్లు వివరించింది.

ప్రభుత్వ వాటా తగ్గింపునకు మూడు బ్యాంకుల కసరత్తు

కొత్త షేర్ల జారీతో భారీగా నిధుల సమీకరణకు ప్రణాళిక

- ఐఓబీ లక్ష్యం రూ.5వేల కోట్లు.. సెంట్రల్ బ్యాంక్ టార్గెట్ రూ.7,000 కోట్లు
- క్యూ ఐపీ ద్వారా రంగంలోకి పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ • మార్కెట్ అనుకూలిస్తే ఈ ఆర్థిక సంవత్సరమే ప్రక్రియ



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వ వాటాను తగ్గించడంతోపాటు మూలధనాన్ని పెంచుకునేందుకు మూడు బ్యాంకులు సిద్ధమవుతున్నాయి. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త షేర్ల జారీ ద్వారా నిధులు సమీకరించేందుకు కసరత్తు చేస్తున్నాయి. మార్కెట్ పరిస్థితులు అనుకూలిస్తే 2026–27 ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలోనే ఈ ప్రక్రియ ఊపందుకోనుంది. ఐఓబీ క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూ ఐపీ) ద్వారా రూ.5వేల కోట్ల వరకు సమీకరించేందుకు అనుమతి పొందింది. అవసరమైన అనుమతుల్లో దాదాపు అన్నీ పూర్తయ్యాయని బ్యాంకు ఎండీ, సీఈవో అజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. మార్కెట్ పరిస్థితులను బట్టి ప్రస్తుత త్రైమాసికం చివర్లో లేదా నాలుగో త్రైమాసికం ప్రారంభంలో షేర్ల జారీ చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే బ్యాంకులో ప్రభుత్వ వాటా ప్రస్తుత 92.44 శాతం నుంచి సుమారు 86 శాతానికి తగ్గనుంది.

మిగతా రెండు బ్యాంకులూ సిద్ధం

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ క్యూ ఐపీ ద్వారా నిధుల సమీకరణకు అవసరమైన అనుమతులు పొందడంతో పాటు మర్చంట్ బ్యాంకర్లను నియమించుకుంది. పెట్టుబడిదారులతో నూ చర్చలు జరిపింది. మార్కెట్ పరిస్థితులు, మర్చంట్ బ్యాంకర్ల సూచనల ఆధారంగా షేర్ల జారీ సమయాన్ని నిర్ణయిస్తామని బ్యాంకు ఎండీ, సీఈవో స్వరూప్ కుమార్ సాహా తెలిపారు. మరోవైపు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వివిధ మార్గాల్లో రూ.7వేల కోట్ల వరకు సమీకరించేందుకు జులైలో వాటాదారుల ఆమోదం పొందింది. క్యూ ఐపీ, ఫాలోఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ), రైట్స్ ఇష్యూ మార్గాలను పరిశీలిస్తోంది.

25 శాతం వాటా ప్రజల వద్ద ఉండాల్సిందే

సెబీ నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీల్లో కనీసం 25 శాతం వాటా ప్రజల వద్ద ఉండాలి. క్యూ ఐపీ ద్వారా సంస్థాగత పెట్టుబడిదారులకు కొత్త షేర్లు జారీ చేయడం వల్ల బ్యాంకులకు మూలధనం సమకూరడంతో పాటు ప్రభుత్వ వాటా శాతం తగ్గుతుంది. వ్యాపార విస్తరణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడం, మూలధన పటిష్ఠతను పెంచుకోవడం, కనీన పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనలకు అనుగుణంగా వాటాల సమీకరణ చేపట్టడం ఈ బ్యాంకుల ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. మార్కెట్ స్పందనను బట్టి నిధుల సమీకరణపై తుది నిర్ణయం తీసుకోనున్నాయి.

మళ్లీ పసిడి ధరల పతనం

- ఢిల్లీలో 10 గ్రాముల బంగారంపై రూ.800 తగ్గుదల
- కిలో వెండిపై ఏకంగా రూ.5 వేల కోత
- అంతర్జాతీయ మార్కెట్లో స్వల్పంగా పెరిగిన ధరలు

న్యూఢిల్లీ: దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గుముఖం పట్టాయి. దీపావళి సెలవుల నేపథ్యంలో మార్కెట్లలో లావాదేవీలు మందగించడంతో పసిడి ధర వరుసగా రెండో రోజూ దిగివచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర బుధవారం రూ.800 తగ్గి రూ.1,45,600కు చేరింది. మంగళవారం ఈ ధర రూ. 1,46,400గా ఉంది. వెండి ధర కూడా రెండు రోజుల స్థిరత్వం తర్వాత భారీగా పడిపోయింది. కిలో వెండిపై రూ. 5వేలు తగ్గడం తో ధర రూ.1,87,500కు చేరింది. ఈ ధరల్లో అన్ని పన్నులు కలిపి ఉన్నాయి.



దీపావళి సెలవుల ప్రభావం

పండుగ సెలవుల కారణంగా దేశీయ మార్కెట్లలో కొనుగోళ్లు, విక్రయాలు పరిమితంగా జరిగాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ తెలిపారు. పలు స్థానిక మార్కెట్లు మూసి ఉండడంతో ట్రేడింగ్ కార్యకలాపాలు మందగించి బంగారం ధరలపై ఒత్తిడి పెరిగిందని వివరించారు. అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం కొనసాగుతుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల విషయంలో కఠిన వైఖరి సంకేతాలు ఇవ్వడం కూడా పసిడి ధరల పుంజుకునే అవకాశాలను పరిమితం చేస్తున్నాయని పేర్కొన్నారు. దేశీయంగా ధరలు తగ్గినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. ఔన్స్ స్పాట్ గోల్డ్ ధర 4,047.71 డాలర్ల వద్ద ట్రేడవగా, వెండి ధర దాదాపు 3 శాతం పెరిగి 52.86 డాలర్లకు చేరింది. గత సెషన్‌లో భారీగా పడిపోయిన బంగారం ధర ప్రస్తుతం ఔన్స్‌కు 4,051 డాలర్ల స్థాయిలో స్థిరపడేందుకు ప్రయత్నిస్తోందని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ విభాగం అధిపతి ప్రవీణ్ సింగ్ తెలిపారు.

దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్లు

- 772 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- 25,250 పాయింట్ల ఎగువన ముగిసిన నిఫ్టీ
- విదేశీ పెట్టుబడుల వెల్లువ.. తగ్గిన ముడి చమురు ధరలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ లాభాల బాటలో పయనించాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం, కంపెనీల రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను మించడం, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం మార్కెట్లకు ఊతమిచ్చాయి. బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ 772 పాయింట్లు ఎగబాకి తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయికి చేరువ కాగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,250 పాయింట్ల ఎగువన స్థిరపడింది. 30 షేర్ల సెన్సెక్స్ 772.75 పాయింట్లు (0.95 శాతం) లాభపడి 81,879.40 వద్ద ముగిసింది. ఫిబ్రవరి 26 తర్వాత ఇదే అత్యధిక ముగింపు స్థాయి. ఒక దశలో 1,413.75 పాయింట్లు (1.74 శాతం) పెరిగి 82,520.40 స్థాయిని తాకింది. మరోవైపు 50 షేర్ల నిఫ్టీ 210.40 పాయింట్లు (0.84 శాతం) పెరిగి 25,255.05 వద్ద స్థిరపడింది. ఇది దాదాపు తొమ్మిది నెలల గరిష్ఠ ముగింపు స్థాయి.



ఆటో, బ్యాంకింగ్ షేర్ల జోరు

సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా అత్యధికంగా 5.25 శాతం పెరిగింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 4.37 శాతం, ట్రెంట్ 3.02 శాతం, టాటా స్టీల్ 2.22 శాతం, ఐటీసీ 2.15 శాతం, యాక్సిస్ బ్యాంక్ 2.14 శాతం చొప్పున లాభపడ్డాయి. విస్తృత మార్కెట్లలోనూ కొనుగోళ్ల నందడి కనిపించింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 1.29 శాతం, మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 1.02 శాతం పెరిగాయి. రంగాల వారీగా ప్రైవేటు బ్యాంకుల సూచీ 3.44 శాతం, ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీ 3.03 శాతం, టెలికమ్యూనికేషన్స్ 2.41 శాతం, ఆటో 2.05 శాతం, బ్యాంకెక్స్ 1.94 శాతం లాభపడ్డాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) ఒక్కరోజే రూ. 7,212.22 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసినట్లు ఎక్స్చేంజీల గణాంకాలు వెల్లడించాయి. మార్కెట్ల ర్యాలీతో మదుపరుల సంపద రెండు రోజుల్లో రూ.4.30 లక్షల కోట్లు పెరిగింది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.